ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 21 జూన్ 2024

తొలగని ఇసుకమేటలు

- 7 నెలలు దాటినా అందని సాయం
- గత సర్కారు మొక్కుబడి స్పందన
- కొత్త ప్రభుత్వంపై అన్నదాత ఆశలు


తిరుమూరు వద్ద రోడ్డు తెగి పొలాల్లో చేరిన రాళ్లు, ఇసుకమేటలు


స్వర్ణముఖి నది ఉప్పొంగడంతో గట్టుతెగి పొలాల్లోకి వెళ్లిన ఇసుకమేటలు

పంట పొలాల్లో ఇసుక మేట వేసి ఏడు నెలలయినా బాధిత రైతులను కష్టాలు వీడలేదు. సాయం అందక, అప్పులు దొరక్క ఇప్పటికీ కోలుకోలేదు. గతేడాది భారీ వర్షాలు స్వర్ణముఖినది పరివాహక ప్రాంత రైతులకు కన్నీళ్లను మిగిల్చాయి. వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం వద్ద కట్ట తెగి వరదనీరు గ్రామాన్ని చుట్టుముట్టింది. నాలుగిళ్లు నది గర్భంలో కలసిపోయాయి. ఒక భవనం సగ భాగం భూమిలోకి వెళ్లింది. నదిని ఆనుకొని ఉన్న వందల ఎకరాల్లో నాలుగు అడుగుల మేర ఇసుకమేటలు వేశాయి. వరి పంట ఇసుకపాలైంది. తిరుమూరులో 35 మీటర్ల మేర రెండు చోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు తెగిపోయింది. పొలాల్లో రాళ్లు, ఇసుకమేటలు చేరాయి. చిన్న, సన్నకారు రైతులు భారీగా నష్టపోయారు. గతేడాది డిసెంబరులో అప్పటి ముఖ్యమంత్రి జగన్ వాకాడు మండలంలో పర్యటించారు. నదిపై వంతెన నిర్మిస్తామని, దెబ్బతిన్న రైతులకు వెంటనే నష్టపరిహారం ఇస్తామని ప్రకటించారు.ఇప్పటికి కూడా ఆ హామీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు.

సాగు కష్టమై...

వరద పోటెత్తి నెలలు గడుస్తున్నా ఒకరిద్దరికి తప్ప మిగతా రైతులకు పరిహారం అందలేదు. వ్యవసాయశాఖ అధికారులు 130మంది బాధిత రైతులను గుర్తించారు. 180ఎకరాల్లో ఇసుక మేటలు ఏర్పడినట్లు నివేదిక రూపొందించారు. వాస్తవానికి ఇంతకంటే ఎక్కువమంది రైతులే నష్టపోయారు. సుమారు 1300 ఎకరాలలో సాగు దెబ్బతింది. పంట ముంపునకు గురై రైతులు బాగా నష్టపోయారు. మళ్లీ సాగుకు సిద్ధం కాలేకపోయారు. వరదసాయం అందక, బ్యాంకుల నుంచి రుణాలు పుట్టక అవస్థలు పడుతున్నారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఎక్కువ వడ్డీకి అప్పులు చేశామని రైతులు వాపోతున్నారు. కొత్త ప్రభుత్వమైనా ఆదుకోవాలని కోరుతున్నారు. తిరుమూరు వద్ద రోడ్డు, బాలిరెడ్డిపాళెంలో వంతెన నిర్మించి ఇసుకమేటలు తొలగించేలా చూడాలని కోరుతున్నారు.అయితే బాలిరెడ్డిపాళెంలో 18మంది రైతులకు నష్టపరిహారం అందిందని మండల వ్యవసాయాధికారిణి దీప చెప్పారు.ఆన్‌లైన్‌లో నమోదుకాని రైతులను కూడా గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపామన్నారు.మిగిలిన రైతులకు కూడా త్వరలో పరిహారం అందుతుందన్నారు.

- వాకాడు

అభివృద్ధిపై ప్రజల ఆశలెన్నో!

నేడు అసెంబ్లీలో కొత్త ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారం

తిరుపతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జిల్లాలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు నేడు శాసనసభలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. అనంతరం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిపాదించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలును పర్యవేక్షించే, సమీక్షించే అధికారాలను, ప్రోటోకాల్ తదితర సదుపాయాలన్నింటినీ సంతరించుకోనున్నారు.తిరుపతి నుంచీ ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి నుంచీ పులివర్తి వెంకటమణి ప్రసాద్ అలియాస్ నానీ, శ్రీకాళహస్తి నుంచీ బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి, సత్యవేడు నుంచీ కోనేటి ఆదిమూలం, సూళ్ళూరుపేట నుంచీ నెలవల విజయశ్రీ, గూడూరు నుంచీ పాశం సునీల్ కుమార్, వెంకటగిరి నుంచీ కురుగొండ్ల రామకృష్ణ, నగరి నుంచీ గాలి భానుప్రకాష్ ఎమ్మెల్యేలుగా గెలిచిన సంగతి తెలిసిందే. శుక్రవారం ప్రారంభం కానున్న అసెంబ్లీ తొలి సమావేశాలకు హాజరై ప్రమాణ స్వీకారం చేయడం కోసం జిల్లా నుంచీ ఈ ఎనిమిదిమంది గురువారమే రాజధానికి పయనమయ్యారు. వీరి వెంట కుటుంబసభ్యులు, సన్నిహిత బంధుమిత్రులు, ముఖ్యనేతలు, అనుచరులు సైతం తరలి వెళ్ళారు.కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేల నుంచీ జిల్లా ప్రజలు ఎంతో ఆశిస్తున్నారు. ముఖ్యంగా సాగునీటి రంగంలో అల్తూరుపాడు ప్రాజెక్టు, గాలేరు-నగరి ప్రాజెక్టు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్, తెలుగు గంగ ప్రాజెక్టు పనులు పెండింగులో వున్నాయి. మల్లిమడుగు మొదలుకుని ఆరణియార్, కాళంగి వంటి రిజర్వాయర్ల ఆధునీకరణ పనులు ఎక్కడివక్కడ ఆగిపోయాయి. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా పారిశ్రామిక వాడల ఏర్పాటు కోసం భూసేకరణ వేగవంతం కావాల్సి వుంది. అంతే వేగంగా పరిశ్రమల ఏర్పాటుకూ చొరవ తీసుకోవాల్సి వుంది. గడచిన ఐదేళ్ళుగా రహదారులు అధ్వాన స్థితికి చేరుకున్నాయి. వాటి మరమ్మతులు, నిర్వహణకు అమిత ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది. చేతులు మారిన ప్రభుత్వ భూముల లెక్కలు తేల్చాల్సి వుంది. వాటిని స్వాధీనం చేసుకోవడానికి, రెవిన్యూ రికార్డులు తారుమారు చేసిన అధికారులను, ఉద్యోగులను గుర్తించి చర్యలు తీసుకోవాల్సివుంది. పర్యాటక రంగ అభివృద్ధికి అందుబాటులో వున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాల్సి వుంది. జిల్లాకు కొత్త రూపునిచ్చే ఈ ప్రధాన అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వుంది. ఈ క్రమంలో నూతన ఎమ్మెల్యేలు చట్టసభలో జనం సమస్యలను ప్రస్తావిస్తారని, వాటి పరిష్కారాలకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తారని, మైలురాళ్ళుగా నిలిచిపోయే అభివృద్ధి పనులను సాధిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

కీలక స్థానాల్లో...

ఉమ్మడి చిత్తూరు జిల్లా పూర్వ అధికారులకు రాష్ట్రప్రభుత్వంలో మంచి పోస్టింగులు

సీఎస్‌గా నీరబ్... సీఎం కార్యదర్శులుగా రవిచంద్ర, ప్రద్యుమ్న

పలువురు ఇతర అధికారులకు కీలక శాఖల బాధ్యత



తిరుపతి, జూన్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గతంలో పనిచేసిన అనేకమంది ఐఏఎస్ అధికారులు ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వంలో కీలక స్థానాల్లో నియమితులయ్యారు.ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన నీరబ్ కుమార్ ప్రసాద్ 1998లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు 72వ కలెక్టర్‌గా పనిచేశారు. 2008-09 నడుమ జిల్లాకు 78వ కలెక్టర్‌గా వ్యవహరించిన ముద్దాడ రవిచంద్ర ఇపుడు సీఎం చంద్రబాబుకు ముఖ్య కార్యదర్శిగా నియమితులయ్యారు. అలాగే 2017-19 నడుమ జిల్లాకు 83వ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన పి.ఎస్.ప్రద్యుమ్న సీఎం చంద్రబాబుకు కార్యదర్శిగా పోస్టింగ్ పొందారు. ప్రద్యుమ్న ఈ కీలక బాధ్యతలకు తోడు యువజన సర్వీసులు, క్రీడలు, సాంస్కృతిక, పర్యాటక శాఖల ముఖ్యకార్యదర్శిగా అదనపు బాధ్యతలు కూడా స్వీకరించారు. గతంలో ఉమ్మడి జిల్లా డ్వామా పీడీగానూ, తిరుపతి మున్సిపల్ కమిషనర్‌గానూ పనిచేసిన ఎం.జానకి, అలాగే ఉమ్మడి జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గానూ, తిరుపతి కమిషనర్‌గానూ పనిచేసిన వాడరేవు వినయ్ చంద్ ఆర్థిక శాఖ కార్యదర్శులుగా నియమితులయ్యారు. 2004లో జిల్లాకు 75వ కలెక్టర్‌గా పనిచేసిన జి.సాయిప్రసాద్ తాజాగా రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2014-17 మధ్య జిల్లాకు 82వ కలెక్టర్‌గా పనిచేసిన సిద్ధార్థ జైన్ ఇపుడు పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా పోస్టింగ్ అందుకున్నారు. గతంలో మదనపల్లె సబ్ కలెక్టర్‌గా పనిచేసిన అహ్మద్ బాబు ప్రస్తుతం ఉద్యాన, ఆక్వాకల్చర్, మత్స్య శాఖల కార్యదర్శిగా నియమితులయ్యారు. ఇక టీటీడీ ఈవోగా పనిచేసిన అనిల్ కుమార్ సింఘాల్ ఇపుడు మున్సిపల్ పాలనా శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఇప్పటి వరకూ తిరుపతి కలెక్టర్‌గా పనిచేసిన ప్రవీణ్ కుమార్ బదిలీపై గనులు, భూగర్భ శాఖ కమిషనర్ మరియు డైరెక్టర్ గానూ, ఏపీ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ గానూ నియమితులయ్యారు. ఈ నియామకాలతో రాష్ట్రంలో జిల్లా ప్రతిష్ఠ ఇనుమడించడంతో పాటు ఆ మేరకు ప్రాధాన్యత కూడా పెరిగింది.

ప్రద్యుమ్నకు తగిన గుర్తింపు



గతంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు జేసీగానూ, కలెక్టర్‌గానూ పనిచేసిన పి.ఎస్.ప్రద్యుమ్నకు ఎట్టకేలకు తగిన గుర్తింపు లభించింది. జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగితే ఆయన రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. అప్పట్లో ఓట్ల లెక్కింపులో అధికార కాంగ్రెస్ పార్టీ తరపున ప్రభుత్వ పెద్దల నుంచీ తీవ్రస్థాయి ఒత్తిళ్లు వచ్చినా ఆయన వెరవకుండా నిజాయితీగా వ్యవహరించడంతో వైసీపీ మద్దతుతో పోటీ చేసిన డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. ప్రభుత్వ పెద్దల మాట ఖాతరు చేయకపోవడంతో ఎన్నికలు ముగిసిన వెంటనే ఆయనను రైతు బజార్ల సీఈవోగా ప్రాధాన్యత లేని పోస్టుకు ప్రభుత్వం బదిలీ చేసింది. అయితే 2014లో టీడీపీ ప్రభుత్వం రావడంతో ఆయన సమర్థతను, నిజాయితీని గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు ఏరికోరి సొంత జిల్లాకు కలెక్టర్‌గా నియమించారు. పని చేసింది రెండేళ్ళే అయినా జిల్లాను అనేక అంశాల్లో జాతీయస్థాయిలో ఉత్తమంగా నిలిపారు. 2018లో 2.77 లక్షల మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మల విసర్జన జరగని తొలి జిల్లాగా దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారు. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులకు కూడా ఎక్కారు.అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఫర్నిచర్, టీవీ వంటివి సమకూర్చారు.పల్లె నిద్ర పేరిట ఒకే రోజు జిల్లావ్యాప్తంగా 2 వేల మంది ఉద్యోగులు అంగన్వాడీ కేంద్రాలను సందర్శించి అవసరమైన వసతులు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.మహిళా వర్శిటీతో ఒప్పందం కుదుర్చుకుని యశోద కార్యక్రమం పేరిట అంగన్వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇప్పించారు. బంగారుపాలెం నుంచీ నాయుడుపేట వరకూ ఇపుడున్న సిక్స్ లేన్ రోడ్డును ప్రతిపాదించింది ఆయనే.ది బెటర్ ఇండియా సంస్థ 2018లో ఎక్కువ మంది ప్రజల జీవన పరిస్థితులను ప్రభావితం చేసిన పదిమంది స్ఫూర్తిదాయక ఐఏఎస్ అధికారులను గుర్తించగా వారిలో ప్రద్యుమ్న 7వ స్థానం దక్కించుకున్నారు.ఇలాంటి అధికారికి 2019 తర్వాత తగిన గుర్తింపు లేకుండా పోయింది.ప్రాధాన్యత లేని శాఖలు కేటాయించారు. ఇటీవలి ఎన్నికల్లో గెలిచి చంద్రబాబు సీఎం కావడంతో ప్రద్యుమ్న సేవలను తగిన విధంగా వినియోగించుకునేందుకు ఆయన ఏకంగా తన కార్యదర్శిగా నియమించుకోవడం విశేషం.

చపాతీలో జెర్రి ప్రత్యక్షం!

- పీఎస్-4 హోటల్ కిచెన్ సీజ్




తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : తిరుపతిలోని పీఎస్-4 హోటల్ కిచెన్‌ను మున్సిపల్ హెల్త్ అధికారులు సీజ్ చేశారు. పుత్తూరుకు చెందిన రాజశేఖరబాబు గురువారం మధ్యాహ్నం పీఎస్4 హోటల్‌కు వచ్చాడు. భోంచేస్తుంటే చపాతిలో చనిపోయిన జెర్రి కనిపించింది. వెంటనే హోటల్ మేనేజర్‌ను పిలిచి చూపించాడు. సరైన సమాధానం రాకపోవడంతో మున్సిపల్ హెల్త్ అధికారులకు, మీడియాకు సమాచారమిచ్చాడు. మున్సిపల్ హెల్త్ అధికారి అవినాష్ రెడ్డి కిచెన్ తనిఖీ చేశారు.కూరగాయలు, ఇతర పదార్థాలు నిల్వ ఉంచడానికి అనువైన వాతావరణం లేదని గుర్తించారు. కుళ్లిన కూరగాయలు, ఆహార పదార్థాలను కూడా అక్కడ గమనించి సిబ్బందిని నిలదీశారు.జెర్రి వున్న చపాతీతో పాటు అక్కడ చెడిపోయిన కూరగాయలను, కొన్ని ఆహార పదార్థాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపుతున్నట్లు మీడియాకు చెప్పారు.జాయింట్ కలెక్టర్‌కు, కమిషనర్‌కు వివరాలను నివేదించారు. కిచెన్ సీజ్ చేసి విచారిస్తున్నారు. కాగా ఈ విషయమై తిరుమల పీఏసీ(పిలిగ్రిమ్ ఎమెనిటీస్ కాంపెక్స్)-4లోని ఆహారంలో జెర్రి కనిపించిందంటూ సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో టీటీడీ అధికారులు స్పందించారు.తిరుపతిలోని ఆ హోటల్‌కు, టీటీడీకి ఎలాంటి సంబంధం లేదని భక్తులు గ్రహించాలని కోరారు.

తూకంలో తేడాలు

సివిల్ సప్లయిస్ గోడౌన్లలో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : జిల్లాలో అన్ని వ్యవస్థలతో పాటు సివిల్ సప్లయిస్ వ్యవస్థ సైతం గాడి తప్పింది. గత ఐదేళ్ళ కాలంలో పేద ప్రజలకు ఇచ్చే రేషన్ సరుకుల్లోనూ అవినీతి చోటు చేసుకుంది.పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల రాష్ట్రంలోని కొన్ని సివిల్ సప్లయిస్ గోడౌన్లను తనిఖీ చేసినప్పుడు పలు అక్రమాలు బయటపడ్డాయి. దీంతో అన్ని జిల్లాల్లో తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు.దీంతో జిల్లా అధికారులు నెల వారీగా లెక్కలు తీస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీలకు ఇక్కడినుంచే బియ్యం, కందిపప్పు, ఆయిల్ వంటివి సరపరా చేస్తున్నారు.పంచదార, కందిపప్పు సరఫరాలో కాంట్రాక్టర్లు తూకాల్లో మోసం చేస్తున్నారని అధికారులంటున్నారు. ఒక్కో రేషన్ షాపు పరిధిలో కనీసం 10 కార్డులకు రేషన్ పంపిణీ కావడం లేదని గుర్తించారు.ఎండీయూ వాహనాలు వచ్చినప్పుడు కార్డుదారులు బయటకు వెళ్లివుంటే కందిపప్పు, బియ్యం, చక్కెర మిగిలిపోతున్నాయి. వీటికి లెక్కలు చూపడం లేదు.పేదలకు ఇస్తున్న బియ్యం, చక్కెరల్లోనూ కిలోకు 100 గ్రాములు లెక్కన తక్కువ పంపిణీ చేస్తున్నట్లు బయటపడింది.ఈ విషయమై సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ సుమతిని అడగ్గా జిల్లా వ్యాప్తంగా వున్న 12 గోడౌన్లు, మండల స్టాకు పాయింట్లలో కందిపప్పు, బియ్యం, చక్కెర స్టాకును పరిశీలించామన్నారు.తూకాల్లో తేడా వున్న మాట వాస్తవమేనని చెప్పారు. ప్రధానంగా కిలో కందిపప్పుపై 20 గ్రాముల నుంచి 50 గ్రాముల వరకు తూకం తక్కువ వున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. అలాగే చక్కెర తూకంలోనూ కిలోపై 30 గ్రాముల వరకు తక్కువున్నట్లు బయటపడిందన్నారు. ఇకపై ప్రతి నెలా నిత్యావసర వస్తువులు తనిఖీ చేసి తూకాల్లో మోసం జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

25న కుప్పానికి ముఖ్యమంత్రి రాక



కుప్పం/చిత్తూరు కలెక్టరేట్, జూన్ 20: ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 25, 26 తేదీల్లో కుప్పంలో పర్యటించనున్నారు.నాల్గవసారి ముఖ్యమంత్రి అయిన తర్వాత కుప్పం రానున్న చంద్రబాబుకు టీడీపీ వర్గాలు ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు ప్రారంభించాయి. తాజా విజయంతో టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం పొంగిపొర్లుతోంది. అదే సమయంలో అధికార వర్గాల్లో గుబులు బయలుదేరింది. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా వ్యవహరించిన వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు ఇంకా ఆయా సీట్లలోనే ఉన్నారు. అటువంటి వారు ముఖ్యమంత్రి రాకపట్ల ఆందోళనగా ఉన్నారు. ప్రభుత్వ యంత్రాంగంతోపాటు వ్యవహారాలపై పూర్తిస్థాయి పట్టున్న చంద్రబాబు ఈ అవకతవకల గురించి, ఎటువంటి అవినీతి చర్యల గురించి ప్రశ్నిస్తారో, ఏమి సమాధానం చెప్పాలో అన్న భయం వారిలో కనిపిస్తోంది.సీఎం పర్యటన ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో చర్చించేందుకు కలెక్టర్ షన్మోహన్ గురువారం అమరావతికి వెళ్లినట్లు సమాచారం. ఇక, కుప్పంలో సీఎం బస చేయనున్న ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆధునికీకరణ పనులను అధికారులు చేపట్టారు. పాత తహసీల్దార్ కార్యాలయంలో అన్న క్యాంటీన్ పునఃప్రారంభించేందుకు అధికారులు పనులు చేస్తున్నారు.


నారాయణగిరి ప్రాంతంలోని క్యూలైన్లో భక్తులకు అందజేస్తున్న కిచిడీని పరిశీలిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో సమీక్ష

తిరుమల, జూన్20 (ఆంధ్రజ్యోతి): వర్షాకాల సన్నద్ధతపై టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం గోకులం విశ్రాంతి భవనంలో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు.వివిధ సందర్భాల్లో భారీ వర్షాలకు బండరాళ్లు కూలి దెబ్బతిన్న రెండో ఘాట్‌రోడ్డును ఎలా పునరుద్ధరించారో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కల్యాణి డ్యాంతో పాటు తిరుమలలో భక్తులకు ప్రధాన నీటి వనరులైన ఐదు డ్యాముల గురించి కూడా వివరించారు. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్లాన్ రూపొందించాలని ఈవో ఆదేశించారు. కొనుగోళ్లు, గిడ్డంగుల శాఖలపై సమీక్షించారు. జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీఈ నాగేశ్వరరావు, ఎస్ఈ2 జగదీశ్వర్‌రెడ్డి, ఈఈలు సురేంద్రనాథ్ రెడ్డి, శ్రీహరి, ఎలక్ట్రికల్ డీఈ రవిశంకర్‌రెడ్డి, కొనుగోళ్ల జీఎం మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.కాగా ఈవో గురువారం నారాయణగిరి షెడ్ల వద్ద వివిధ క్యూలైన్లను పరిశీలించారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌కు వెళ్లే సర్వదర్శన, స్లాటెడ్ సర్వదర్శన, ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్లను తనిఖీ చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పించేందుకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఈవోకు పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపించింది. క్యూలైన్లలోనే వ్యర్థాలు కనిపించడంతో ఆయన సీరియస్ అయ్యారు.సంబంధిత అధికారికి షోకాజ్ నోటీసు ఇవ్వాలని ఆదేశించారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు


అమ్మవారి ఆలయం వద్ద మహదేశికన్ స్వామి

తిరుచానూరు, జూన్ 20: తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉదయం భూగర్భ గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు ఆయనకు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. సూపరింటెండెంట్ శేషగిరి తదితరులు పాల్గొన్నారు. శ్రీరంగం శ్రీమద్ అండవాన్ ఆశ్రమం పీఠాధిపతి మహదేశికన్ స్వామి తన శిష్యబృందంతో దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

ఎమ్మెల్యే నానీకి మంత్రి పరామర్శ



తిరుచానూరు, జూన్ 20: చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పరామర్శించారు. గురువారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ్ రిసార్ట్స్‌లోని నాని నివాసానికి ఆ యన చేరుకున్నారు. ఎమ్మెల్యే ఆయనకు ఘనస్వాగతం పలికారు. మంత్రి జన్మదినం సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. 30ఏళ్ల చంద్రగిరి రికార్డును తిరగరాసిన పులివర్తి నానిని ప్రశంసించారు.

మంత్రి రవీంద్రకు సన్మానం

చంద్రగిరి, జూన్ 20: గనుల శాఖ మంత్రి రవీంద్రను మండల టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు గురువారం సన్మానించారు. బుచ్చినాయుడుపల్లెకు చెందిన టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు వేణు ఆధ్వర్యంలో నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సన్మానించారు. టీడీపీ నాయకులు చంద్రమౌళి, శంకర్, రామారావు, శ్రీపతి, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అడ్డుకుందాం

రామచంద్రాపురం, జూన్ 20: బాల్య వివాహాలను అడుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పావనశ్రీ పిలుపునిచ్చారు. గంగిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద గురువారం బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల వలన కుటుంబ వ్యవస్థ దెబ్బతింటుందన్నారు. ఈ వివాహాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అంగన్‌వాడీ సిబ్బంది పావని, దేశమ్మ, అరుణ పాల్గొన్నారు.

పనపాకం పంచాయతీలో డెంగ్యూ జ్వరాలు

గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన

చంద్రగిరి, జూన్ 20: పనపాకం పంచాయతీలో ఇద్దరికి డెంగ్యూ జ్వరాలు రావడండతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు.పాతపేటలో ఓ యువతికి, అంబేడ్కర్ కాలనీలో మరో మహిళకు డెంగ్యూ జ్వరాలుగా నిర్ధారించారు. వైద్య సిబ్బంది గ్రామంలోని అందరికీ వైద్య పరీక్షలు చేశారు. పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో సబ్ యూనిట్ అధికారి శివయ్య పనపాకం, పాతపేట గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పనపాకం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డేని తప్పని సరిగా పాటించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కిరణ్‌కుమార్, సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న గ్రామస్తులు



చంద్రగిరి, జూన్ 20: చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, చంద్రగిరిలో పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పుల్లయ్యగారి పల్లెలో గ్రామస్తులు గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. వీరిద్దరి విజయం కాంక్షిస్తూ గ్రామస్తులు గతంలో మొక్కుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి, యువతకు ఉపాధి, ఉద్యోగాలు, రైతులకు సహకారం చంద్రబాబుతోనే సాధ్యమవతుందని గ్రామస్తులు తెలిపారు.

నేను బడికి పోతా


బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పావనశ్రీ

రామచంద్రాపురం, జూన్ 20: పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈవోలు మార్కొండయ్యానాయుడు, జయవేలు కోరారు. గురువారం స్థానిక ఆర్‌సీపురం ఎస్సీకాలనీలో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. కమ్మకండ్రిగ ఉన్నత పాఠశాల నుంచి ఆర్‌సీపురం ఎస్సీకాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 6-14ఏళ్ల పిల్లలందరూ బడిలోనే ఉండాలన్నారు. డ్రాపౌట్స్ పిల్లలను తిరిగి బడిలో చేర్పించాలన్నదే నేను బడికి పోతా కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి, ఉపాధ్యాయులు, సీఎంఆర్టీలు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎంను కలిసిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి, జూన్20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే కుమారులు మదన్, జగన్‌లతో దివంగత టీటీడీ ఛైర్మన్ డీకే ఆదికేశవుల నాయుడు తనయుడు డీఏ శ్రీనివాసులతో కలసి రేవంత్ రెడ్డికి శ్రీవారి ప్రతిమ, తీర్థ ప్రసాదాలు అందజేసి, అభినందనలు తెలిపారు.

రుయాలో పనిభారం తగ్గించాలని వినతి


సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

తిరుపతి(వైద్యం), జూన్ 20 : రుయాస్పత్రిలో ఖాళీ పోస్టులు భర్తీ చేసి ఉద్యోగులపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి రుయా సూపరింటెండెంట్ రవిప్రభను కోరారు. యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) నేతలతో కలిసి ఆయన రుయాస్పత్రిలో గురువారం సూపరింటెండెంట్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధన మేరకు సిబ్బంది లేకపోవడం, కొత్తగా నియామకాలు చేపట్టకపోవడంతో పనిభారం పెరిగి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఇప్పటికే పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోకపోవడం తగదన్నారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనకు దిగాల్సి వస్తుందన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతోపాటు సమస్యలను పరిష్కస్తామని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు.యూనియన్ అధ్యక్షుడు మునిచంద్ర, ప్రధాన కార్యదర్శి నరసింహులు, నేతలు నాగపద్మలత, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్మికునికీ బీమా భరోసా


మాట్లాడుతున్న డీఎం వెంకటరమణ

తిరుపతి (జీవకోన), జూన్ 20: మెకానిక్ వృత్తి జీవనాధారంగా శ్రమిస్తున్న ప్రతి కార్మికుని కుటుంబానికి పోస్టల్ శాఖ రూ.10 లక్షల మేర బీమా భరోసా ఇస్తోందని టూవీలర్ మెకానిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి తెలిపారు. గాంధీభవన్ ఆధ్వర్యంలో గురువారం నెలవారీ అసోసియేషన్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీమా అవసరాన్ని వివరించారు. అనంతరం కేశ్వన్ టీవీఎస్ షోరూం డీఎం వెంకటరమణ మాట్లాడుతూ కొత్త ఎలక్ట్రానిక్స్ ప్యూచర్స్‌పై అవగాహన అవసరమన్నారు. మల్లీశ్వరన్, జలంధర్, ప్రభు, గురు ఆచారి, బాబ తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

భాకరాపేట, జూన్ 20: ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నట్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. చిన్నగొట్టిగల్లు, రంగన్నగారిగడ్డలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా శాఖ మంత్రి లోకేశ్ పలు మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. టీడీపీ నాయకులు బెల్లం కొండ మురళి, కొట్టే శివకుమార్, మదనమోహన్, చిట్టెమ్మ, విజయశేఖర గౌడ్, హెచ్‌ఎంలు మృదులా దేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు కిట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు





వేడుకగా గజవాహన సేవ

- నేటితో ముగియనున్న పద్మావతీ దేవి తెప్పోత్సవాలు

తిరుచానూరు, జూన్ 20: తిరుచానూరులోని పద్మావతీదేవి తెప్పోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి అమ్మవారు తెప్పపై విహరించి భక్తులను కటాక్షించారు. మధ్యాహ్నం పద్మసరోవరంలోని నీరాడ మండపంలో నేత్రపర్వంగా అర్చకులు అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించారు.రాత్రి సర్వాలంకార శోభితురాలైన అలమేలు మంగమ్మ తెప్పపై కొలువుదీరి ఐదు పర్యాయాలు విహరించి భక్తులను అనుగ్రహించారు. రాత్రి లక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారికి మాడ వీధుల్లో గజవాహన సేవ జరిగింది. శుక్రవారం గరుడవాహన సేవతో ఐదు రోజులుగా జరుగుతున్న తెప్పోత్సవాలు ముగియనున్నాయి. ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు బాబుస్వామి, మణికంఠ, సూపరింటెండెంట్లు మధు, శేషగిరి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, గణేష్, సుభాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో అవకతవకలపై విచారణ జరిపించాలి

- టీడీపీ నాయకుల ఆందోళన


పాత తేదీల బిలును చూపుతున్న మనోహర్‌చౌదరి, పక్కనే నేతలు

తిరుపతి రూరల్, జూన్ 20: తిరుపతి రూరల్ మండలం సి.మల్లవరం పంచాయతీలో వైసీపీ ప్రభుత్వ హయాంలో సర్పంచ్, కార్యదర్శి కుమ్మక్కై బిల్డింగ్ అనుమతులు, నల్లా కనెక్షన్లు, డ్రైనేజీ పనుల్లో భారీగా అవినీతికి పాల్పడ్డారని టీడీపీ గ్రామ ఇన్‌చార్జ్ మనోహర్ చౌదరి ఆరోపించారు. పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం పార్టీ ఆధ్వర్యంలో నాయకులతో కలసి ఆయన ఆందోళన చేపట్టారు. మనోహర్ మాట్లాడుతూ.. పంచాయతీల్లో దాదాపు 200వరకు నీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చి రూ.11వేల వంతున వసూలు చేశారన్నారు. నగదు ట్రెజరీల్లో ఈ బిల్లు కట్టలేదని ఆరోపించారు. ప్రభుత్వం మారాక ఒకరిద్దరికి పాతతేదీలు వేసి బిల్లులు ఇస్తుండగా..మరి కొంతమందికి ఇప్పటికీ బిల్లులు ఇవ్వలేదన్నారు. ఇళ్ల నిర్మాణ అనుమతులకు రూ. 2లక్షల నుంచి రూ. 3లక్షల వరకు వసూలు చేశారన్నారు. వారికి కూడా బిల్లులు ఇవ్వలేదన్నారు. నిలదీస్తే రూ.5లక్షలు అవుతుందని బెదిరించే వారన్నారు. ఆర్టీఐ ద్వారా పంచాయతీ కార్యదర్శిని కోరినా సమాచారం ఇవ్వలేదన్నారు. మూడేళ్లుగా పంచాయతీలో జరిగిన అవినీతిపై విచారించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవిషయంపై సర్పంచ్ మొక్కల భారతి, కార్యదర్శి దుష్యంత్‌రెడ్డిలు మాట్లాడుతూ నీటి కుళాయి కనెక్షన్లు తీసుకున్న వారి నగదును విడివిడిగా కాకుండా ఒకేసారి ఎక్కువ మొత్తంలో ట్రెజరీలో చెల్లించామన్నారు. అవినీతికీ పాల్పడలేదని అంటున్నారు. కనెక్షన్ ఇచ్చేందుకు అధికంగా వసూలు చేయలేదని వివరించారు. టీడీపీ నాయకులు రవిచంద్రనాయుడు, షావలి, ప్రభు, గణేష్, శంకర్‌రెడ్డి, నవీన్‌రాజు, గిరిధర్‌రెడ్డి, మురళి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల మేళాకు మంచి స్పందన


మేళాను ప్రారంభిస్తున్న వెంకటరత్నం నాయుడు

తిరుపతి(ఆటోనగర్)జూన్20: రాస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవార ప్రారంభించిన చిరుధాన్యాల ఉత్పత్తుల మేళాకు మంచి స్పందన వచ్చింది. మేళాను రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కల్తీ ఆహార పదార్థాల నుంచి కాపాడుకోవడానికి ప్రజలు చిరుధాన్యాలు తీసు కోవడం మంచిదన్నారు. సేంద్రియ ఎరువుల ద్వారా చిరుధాన్యాలు పండించే విధానాలను కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు వివరించారు. ఆహారపు అలవాట్లు మార్చుకోవడంవల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునన్నారు. మరో రెండు రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. 250 మంది రైతులు పాల్గొన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రసాదరావు, కె.గంగాధరం,వి.దివ్య, తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం : ఎస్పీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాయుడుపేటటౌన్/తడ, జూన్ 20 : గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లాఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. గురువారం నాయుడుపేట, తడకు వచ్చిన ఆయన మొదటగా నాయుడుపేట డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని రికార్డులు పరిశీలించి అనంతరం సర్కిల్ కార్యాలయం చేరుకొని రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి భీములవారిపాళెం చెక్‌పోస్టులను పరిశీలించారు. నేర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై కఠిన వైఖరిని అవలంభించాలంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఆ ప్రకారం గంజాయి వినియోగించినా, రవాణాచేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, ఆ బృందంలో ఒక సీఐతోపాటు ముగ్గురు ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. గంజాయిపై నిఘాపెట్టి రవాణాచేసే వ్యక్తులను గుర్తించి దానిని అరికట్టడమే ఈ బృందం లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా భీములవారిపాళెం చెక్‌పోస్టులోని సెబ్ విభాగంలో పలు రికార్డులను పరిశీలించారు. అక్రమ రవాణాను అరికట్టేలా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అక్కడ అధికారులను ఆదేశించారు. ఎస్పీతోపాటు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులురెడ్డి, మధుబాబు, జగన్‌మోహన్‌రావు, ఎస్‌ఐలు గోపీ, నరసింహరావు ఉన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

సూళ్లూరుపేట : పబ్లిక్ న్యూసెన్స్ తగ్గించాలనే ముఖ్య ఉద్దేశంతో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ విష్ణువర్ధన్ రాజు అన్నారు. గురువారం ఆయన సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలిగి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపతామన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, శ్రీహరికోట ఎస్‌ఐ రఘునాథ్ ఉన్నారు.

ఆ వడ్డీ డబ్బులు ఏమైనట్లు?

- తేలని బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధుల వడ్డీ లెక్క
- బ్యాంకులో డబ్బులున్నా ఖర్చయినట్లు యుటిలైజేషన్ సర్టిఫికేట్ అందజేసిన ఆడిట్ అధికారి
- విశ్రాంత అధికారి ఫిర్యాదుతో బయట పడ్డ బాగోతం

చిత్తూరు రూరల్, జూన్ 20: జిల్లా పరిషత్తులో బీఆర్‌జీఎఫ్, ఆర్థిక సంఘం నిధులను పీడీ ఖాతాల నుంచి సేవింగ్స్ అకౌంట్లకు మళ్లించారు. తద్వారా వచ్చిన వడ్డీ ఏమైందన్నది ప్రశ్న. 2005 నుంచి 2024 వరకు వచ్చిన వడ్డీనే రూ.వంద కోట్లు ఉంటుందని అంచనా. ఇంత కాలం గుట్టుచప్పుడు కాకుండా జరిగి పోయిన వడ్డీ డబ్బుల దుర్వినియోగం.. ఓ విశ్రాంత అధికారి ఫిర్యాదుతో వెలుగుచూసింది.

2008లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి 'బ్యాక్‌వర్డ్ రీజియన్ గ్రాంట్ ఫండ్ (బీఆర్‌జీఎఫ్)ను ఏర్పాటు చేశారు. ఈ నిధులను కరువు జిల్లాల్లో జడ్పీ, మున్సిపాలిటీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు ఏర్పాటు, అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులు ముందుగా జడ్పీకి వచ్చి.. అక్కడ్నుంచి మున్సిపాలిటీ, మండల పరిషత్, గ్రామ పంచాయతీలకు అందజేస్తారు. జిల్లాకు సంబంధించి ఈ నిధుల్లో 2008 నుంచి 2017 వరకు పదేళ్లపాటు అప్పటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి.. మున్సిపాలిటీలకు రూపాయి కూడా ఇవ్వకుండా పూర్తిగా జడ్పీకి మళ్లించారు. ఇక, 2008 నుంచి 2014 వరకు బీఆర్‌జీఎఫ్.. 2005 నుంచి 2024 వరకు ఆర్థిక సంఘ నిధులు కలిపి ఏటా రూ.500 కోట్ల వరకు జిల్లాకు మంజూరయ్యాయి. ఈ నిధులన్నీ (పీడీ అకౌంట్) ప్రభుత్వ ఖాతాలకు జమయ్యేవి. ఈ ఖాతాల్లో ఉండే నిధులకు వడ్డీ రాదు. అందుకని వడ్డీ కోసం ఈ నిధులను అప్పటి సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి సేవింగ్స్ అకౌంట్లలోకి మళ్లించినట్లు తెలిసింది. ఈ సేవింగ్స్ ఖాతాల్లోని డబ్బులకు వడ్డీలే సుమారు రూ.100 కోట్ల వరకు ఉంటాయని అంచనా. ఈ వడ్డీ డబ్బులను ప్రభుత్వానికి లెక్కలు చూపించకుండా తనకు అనుకూలంగా ఉన్న ప్రజాప్రతినిధుల సొంత పనులకు వినియోగించినట్లు ఇతడిపై విశ్రాంత అధికారి కనకరాజులు నాయుడు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై విచారణ మొదలైంది.

ఏం జరుగుతోంది?

ఆర్థిక సంఘం, బీఆర్‌జీఎఫ్ నిధుల ద్వారా ఖర్చు చేసిన ప్రతి రూపాయికి ఏటా ఆడిటింగ్ చేసి అంతా సక్రమంగా ఉంటే అధికారులు యుటిలైజేషన్ సర్టిఫికెట్ అందజేస్తారు. ఇక్కడ అధికారులు ఆడిటింగ్ చేసేటప్పుడే సేవింగ్స్ ఖాతాల్లో నుంచే బిల్లులు మంజూరు చేసినట్లు గుర్తించి ఉండాలి. ఒక వేళ గుర్తిస్తే సేవింగ్స్ ఖాతాల్లో ప్రభుత్వ నిధులు ఉంచడం నేరమని, ఆ విషయాన్ని వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి. గుర్తించలేదన్నా...కేంద్రం నుంచి వచ్చిన డబ్బులు కన్నా అధికంగా ఖాతాల్లో ఉంటే దానిని ఆడిటింగ్‌లో ప్రస్తావించాలి. ఇవేమి కూడా ఆడిటింగ్ అధికారులు చేయకుండా యుటిలైజేషన్ సర్టిఫికెట్లను ఇస్తూ రావడంపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. మళ్లీ దీనిపై ఆడిటింగ్ అధికారులే విచారణ చేయడం వల్ల.. సక్రమంగా ముందు సాగదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అధికారం మారగానే..

వైసీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రభాకర్‌రెడ్డి జడ్పీలో చక్రం తిప్పారు. టీడీపీ అధికారంలోకి రావడంతో పరిస్థితి భిన్నంగా మారింది. నాడు వేధింపులకు గురైన అధికారులు, ఉద్యోగులు అతడిపై ఫిర్యాదు చేయడానికి ముందుకు వస్తున్నారు. ఇతడి వేధింపులతో నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ప్రాణాలు కోల్పోయారని ఇటీవల అధికారులు జడ్పీ సీఈవో గ్లోరియాకు ఫిర్యాదు చేశారు. ఈ నెలాఖరున ప్రభాకర్‌రెడ్డి పదవీ విరమణ ఉంది. ఆలోపే అతడిపై చర్యలు తీసుకునేలా పావులు కదుపుతున్నారు. మైనారిటీ వెల్ఫేర్ ఇన్‌చార్జి ఈడీగా ఉన్న ప్రభాకర్‌రెడ్డిని తొలగించి ఆ స్థానంలో పూర్వ అధికారి హరినాథ్‌రెడ్డిని తీసుకురావడం అందులో భాగమేనని అంటున్నారు.

2008 నుంచీ జడ్పీలోనే..

2008 నుంచి 2017వరకు పదేళ్లపాటు ప్రభాకర్‌రెడ్డి జడ్పీలో సూపరింటెండెంట్‌గా పనిచేశారు. 2017లో ఎంపీడీవోగా ప్రమోషన్ వచ్చినా వెళ్లకుండా జడ్పీలోనే ఓఎస్డీ పోస్టింగు వేయించుకొని ప్లానింగ్ సెక్షన్‌లోనే సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చా మొదట ఏవోగా, తర్వాత డిప్యూటీ సీఈవోగా, ఆ తర్వాత సీఈవోగా ఇన్‌చార్జిగా ఉంటూ..ఏక కాలంలో ఈ మూడు పోస్టుల్లోనూ కొనసాగడం గమనార్హం.


ఆందోళనలో బండి చలపతి తదితరులు

యూజీసీ నెట్ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులపై చర్యలు

ఏఐఎస్ఎఫ్ డిమాండ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 20: యూజీసీ నెట్ ప్రశ్నాపత్రాన్ని లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి డిమాండ్ చేశారు. ఎస్వీ యూనివర్సిటీలో గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో తరగతులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ప్రకాశం భవన్ వద్ద నిరసన కార్యక్రమంలో చలపతి మాట్లాడారు. దేశ చరిత్రలోనే తొలిసారిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన యూజీసీ నెట్ ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందన్నారు. యుద్ధాలను ఆపే మోదీ ప్రశ్నాపత్రం లీక్‌ను ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. ఎన్నో ఏళ్ళుగా కష్టపడి చదువుకున్న పేద విద్యార్థులు అన్యాయానికి గురయ్యారన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే పార్లమెంట్ ముట్టడిస్తామన్నారు. నాయకులు ఉదయ్, నవీన్, ప్రవీణ్, చంద్రనాయక్, సురేష్ నాయక్, తిరుమలేష్ పాల్గొన్నారు.

ఓఆర్‌ఐకు ఏసీ యూనిట్ వితరణ


ఓఆర్ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు ఏసీ యూనిట్ అందిస్తున్న దాతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 20: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ)కు ముగ్గురు ప్రవాస భారతీయులు ఏసీ యూనిట్‌ను వితరణ చేశారు. ఇందుకు సంబంధించిన సామగ్రిని ఓఆర్ఐ డైరెక్టర్ ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లుకు వారు గురువారం అందజేశారు. జార్జియాలోని సెరినిటీ ఇన్ఫోటెక్ ప్రతినిధి శ్రీనురెడ్డి, విజన్ ఇన్ఫోటెక్‌కు చెందిన ఉపేంద్రరెడ్డి, సీ-విజన్ ఇన్ఫోటెక్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి దాతల్లో ఉన్నారు. ఓఆర్ఐను ఆధునీకరించడానికి తమ వంతు సహకారం అందిస్తామని వీరు పేర్కొన్నారు. సుందరరాజారెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సిద్ధయ్య పాల్గొన్నారు.

యోగా సాధన ద్వారా మానసిక వికాసం



తిరుపతి రూరల్, జూన్ 20: యోగా సాధనతో శారీరక, మానసిక వికాసాభివృద్ధిని సాధించవచ్చని డాక్టర్ హరి సింగ్ గౌర్ యూనివర్సిటీ(మధ్యప్రదేశ్) యోగావిభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ గణేష్ శంకర్ పేర్కొన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీలో యోగా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల అంతర్జాతీయ యోగా సదస్సు గురువారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ..రోగం వచ్చినప్పుడు కాకుండా రోజూ యోగా సాధన చేయాలని సూచించారు. ఇంద్రియ నిగ్రహం, మానసిక ప్రశాంతత, శారీరక దారుఢ్యం వంటి ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఆర్ఎస్ఎస్ దక్షిణ మధ్య క్షేత్ర ప్రచారక్ ఎస్.భరత్‌కుమార్ మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యకర జీవనాన్ని సాగించాలన్నారు. ఇండియన్ యోగా అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఆర్.ఎలన్గోవన్, ఎస్వీ ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుదీక్షిత్, నేపాల్ సంస్కృత వర్సిటీ ఇంటర్నేషనల్ రిలేషన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రేమ్‌రాజ్ నౌపేయి మాట్లాడారు. వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, సాంఖ్య విభాగం హెడ్ డాక్టర్ డి.జ్యోతి, యోగా విజ్ఞాన విభాగం హెడ్ డాక్టర్ ఆర్.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నానీకి ఆపస్‌నేతల అభినందన


ఎమ్మెల్యే పులివర్తినానీని సన్మానిస్తున్న బాలాజీ, తదితరులు

తిరుపతి రూరల్, జూన్ 20: చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికైన పులివర్తినానిని ఏపీ ఉపాధ్యాయసంఘ (ఆపస్) నాయకులు గురువారం సత్కరించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి నేతృత్వంలో పలువురు టీచర్లు ఆయనను అభినందించారు. జీవో 117 రద్దు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐఆర్, 12వ పీఆర్సీ కమిటీ నియామకం, దీర్ఘకాలిక పెండింగ్ బకాయిలు వంటి అంశాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శిలు తూకివాకం నాగరాజు, గట్ల సాంబిరెడ్డి, సహాధ్యక్షులు డాక్టర్ దేవరాజులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.18 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. బుధవారం 79,584 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 31,848 మంది తలనీలాలు సమర్పించారు.

బాధిత వర్గాలకు ప్రభుత్వం అండగా ఉండాలని కోరుకున్నా

మంత్రి కొల్లు రవీంద్ర



తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): నష్టపోయిన అన్ని వర్గాలకు ఈ ప్రభుత్వం అండగా ఉండాలని స్వామిని కోరుకున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాలని, పవన్ కల్యాణ్, మోదీ సహకారంతో చక్కటి ప్రభుత్వం ఏర్పాటు కావాలని తాను ఓ యాగం చేసినట్టు తెలిపారు. యాగం సంపూర్ణంగా ముగిసిన నేపథ్యంలో శ్రీవారి ఆశీస్సుల కోసం తిరుమలకు వచ్చినట్టు తెలిపారు. రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టాలని, అన్ని విధాల ముందుకు తీసుకెళ్లాలని స్వామిని కోరుకున్నట్టు చెప్పారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే ఉపేక్షించం

డీఎస్పీ రవిమనోహరాచారి



తనిఖీ చేస్తున్న డీఎస్పీ, సీఐలు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20: ట్రబుల్ మాంగర్లు, పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, అల్లరి మూకల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని నగర డీఎస్పీ రవి మనోహరాచారి హెచ్చరించారు. గురువారం ఆయన సమస్యాత్మక ప్రాంతాలు, అల్లరి మూకలు స్థావరాలున్న పట్టణాలు, శివారు ప్రాంతాలను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ రాత్రి 8 గంటల తర్వాత అల్లరి మూకలు, రౌడీలు, ట్రబుల్ మాంగర్స్ కనిపిస్తే అరెస్టు చేస్తామన్నారు. గుంపులుగా నిలబడి కబుర్లు చెప్పుకుంటూ మందు తాగి గలాటాలు చేస్తే కుదరదన్నారు. సమయపాలన పాటించకుంటే బార్ల యజమానులపై కేసులు పెడతామన్నారు. దీనికోసం ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామన్నారు. ఇకపై సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పోలీసులు అన్ని రోడ్లు, దుకాణాలు, మాల్స్, బార్లు, తనిఖీలు చేస్తాన్నారు. గంజాయి రవాణా, వినియోగం, విక్రయాలపై నిఘా ఉంచామన్నారు.

రేపు తిరుపతికి డీఆర్ఎం రాక

తిరుపతి(సెంట్రల్)జూన్20: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ మేనేజరు వినీత్ సింగ్ శనివారం తిరుపతి రానున్నారు. ఆయన తనిఖీలు నిర్వహించనున్నారు. శని,ఆది,సోమవారాల్లో శ్రీకాళహస్తి,రేణిగుంట,కాట్పాడి స్టేషన్లతో పాటు రైలు మార్గాలను కూడా తనిఖీ చేస్తరని అధికార వర్గాలు తెలిపాయి.

తిరుమలకు మోకాళ్లపై కలికిరి మహిళ



చివరిమెట్టు వద్ద పసుపు వేస్తున్న గౌరి

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి):ఎన్డీఏ కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఓ మహిళ మోకాళ్లపై మెట్లెక్కి తిరుమలకు చేరుకుంది. పీలేరు నియోజకవర్గం కలికిరి మండలం, గుట్టపాళెంకు చెందిన గౌరి తన భర్త మల్లికార్జున గౌడ్‌తో కలిసి గురువారం శ్రీవారిమెట్టు మార్గంలో మోకాళ్లపై తిరుమలకు చేరుకుంది. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం కావాలని, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందాలని తాను గతంలో మొక్కుకున్నట్టు తెలిపారు. తన కోరిక నెరవేరిన నేపథ్యంలో మొక్కు చెల్లించుకున్నానన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు ఐఐటీ మెడికల్ ఫౌండేషన్ మెటీరియల్

తిరుపతి(విద్య), జూన్ 20: ఐఐటీ (కోటా), మెడికల్ ఫౌండేషన్ స్టడీ మెటీరియల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు జేఈఈ-నీట్ ఫోరం కన్వీనర్ లలిత్‌కుమార్ తెలిపారు. 6,7,8,9,10 తరగతుల విద్యార్థులు జేఈఈ, నీట్‌కు పరీక్షలకు ఇప్పటినుంచే సంసిద్ధమయ్యేందుకు ఈ స్టడీ మెటీరియల్ ఉపకరిస్తుందన్నారు. స్టడీ మెటీరియల్ తోపాటు అసైన్మెంట్లుకూడా సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ఫౌడేషన్ మెటీరియల్‌ను డిజిటల్ మొబైల్ వెర్షన్‌లో వాట్సప్ ద్వారా పొందొచ్చన్నారు. మరిన్ని వివరాలను ఐఐటీఎఫ్, ఎండీఎఫ్ అని టైప్‌చేసి 9849016661 సెల్ నంబర్ వాట్సప్‌కు మెసేజ్ చేయాలని సూచించారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ వితరణ

తిరుపతి అర్బన్, జూన్ 20: మెగాస్టార్ చిరంజీవి తనయుడు రాంచరణ్ కుమార్తె క్లింకార తొలి పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం మెగా అభిమాని, జనసేన నాయకుడు రుద్రకిషోర్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేశారు. స్థానిక టీపీపీఎం స్కూల్ విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, ఉపకరణాలు పంపిణీ చేశారు. తిరుచానూరులోని ముళ్ళపూడిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జనసేన రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణీ, వెంకట్‌రాయల్, హేమంత్, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి- మధురై బస్సులో ఛార్జీల తగ్గింపు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 20: శ్రీకాళహస్తి- మధురై ఆర్టీసీ బస్సులో ఛార్జీలను తగ్గించారు. ఇంటర్‌స్టేట్ రవాణాను పరిగణలోకి తీసుకుని తమిళనాడు తరహాలోనే అధికారులు ఛార్జీలను ఖరారు చేశారు. 25శాతం టికెట్ రేటు తగ్గించి బుధవారం నుంచి అమలు చేస్తున్నారు. తాజాగా పెద్దలకు రూ.765, పిల్లలకు రూ.430 వసూలు చేస్తున్నారు. తమిళనాడుతో సమానంగా చార్జి ఉందని ప్రయాణికులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ బస్సు రోజూ సాయంత్రం 5గంటలకు శ్రీకాళహస్తి నుంచి బస్ బయల్దేరుతుంది. తిరుపతిచేరుకుని 6.30 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 6.15గంటలకు చేరుకుంటుంది. అక్కడనుంచి సాయంత్రం 6గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 6గంటలకు తిరుపతి, 7గంటలకు శ్రీకాళహసి చేరుకుంటుంది.తిరుపతి-కాణిపాకం మధ్య అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రెండు అల్ట్రాడీలెక్స్ బస్సులు ఏర్పాటు చేశారు. తిరుపతి సీబీఎస్‌లో ఉదయం 6.20 గంటలకు , 7.20 గంటలకు ఈ బస్సులు బయల్దేరుతాయి.

అలరించిన రామదాసు కృతులు



సప్తగిరి సంగీత సప్తాహంలో ఆలపిస్తున్న సంగీత కళాకారులు

తిరుపతి (కల్చరల్) జూన్ 20: తిరుపతికి చెందిన పాస్ మనోవికాస్ సేవా సంస్థ, టీటీడీకి చెందిన అన్నమాచార్య ప్రాజక్టు కళాకారులు సప్తగిరి సంగీత సప్తాహం పేరుతో నిర్వహిస్తున్న సంగీతయజ్ఞం గురువారం ఐదవ రోజుకు చేరుకుంది. వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 7 గంటల నుంచి పలువురు గాత్ర విద్వాంసులు నిరంతరంగా భద్రాచల రామదాసు, తదితర వాగ్గేయకారుల కీర్తనలు, కృతులు ఆలపించారు. చెన్నైకి చెందిన ప్రముఖ వయోలిన్ కళాకారిణి కన్యాకుమారి వాయలీన కచేరీ ఆహూతులను అలరించింది. ఆరంగి మెంకట్రావు (శ్రీకాకుళం) గాత్రం, కె. శ్రీదేవి బృందం(తిరుపతి) ప్రదర్శించిన నృత్యం సభికులను ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు నిరంతరంగా అన్నమాచార్యుల సంకీర్తనలు, కృతులు ఆలపిస్తారని నిర్వాహకులు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు.

రామోజీరావు విగ్రహ ఏర్పాటుకు కృషి : చింతా

తిరుపతి(వైద్యం), జూన్ 20 : ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు విగ్రహాన్ని తిరుపతిలో ఏర్పాటు చేసేందుకు వ్యక్తిగతంగా కృషి చేస్తానని మాజీ ఎంపీ చింతా మోహన్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే రామోజీరావు మెమోరియల్ లెక్చర్ ఏర్పాటు చేసి దేశ వ్యాప్తంగా 9మంది ఉత్తమ జర్నలిస్టులకు ఆయన పేరుమీద అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.నీట్ పరీక్షను రద్దు చేసి పాత విధానంలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. తిరుపతివాసులకు ప్రతి మంగళవారం ఉచితంగా శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించాలని కోరారు. కాంగ్రెస్ నగర పార్టీ అధ్యక్షుడు యార్లపల్లి గోపి, తేజోవతి, శాంతి, రవి, కుమార్, రావణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణన వెంటనే చేపట్టాలి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

తిరుపతి(వైద్యం), జూన్ 20 : రాష్ట్రంలో బీసీ కులాలను గుర్తించి సంక్షేమ పథకాలతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు బీసీ కులగణన చేపట్టాలని బీసీ విద్యార్థి సంఘం నేతలు నాగేశ్వరరావు కోరారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన బీసీ విద్యార్థి సంఘ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభద్రతా భావంతో పనిచేస్తున్న బీసీ ఉద్యోగులకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తుందనే నమ్మకం ఉందన్నారు. బీసీ సంక్షేమ వసతి గృహాలు శిథిల దశలో ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వసతులతో కూడిన సొంత భవనాలను ఏర్పాటు చేయాలన్నారు. బీసీలంతా ఏకమై టీడీపీ కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. బీసీ విద్యార్థి సంఘ నేతలు నాగేంద్ర, రామాంజీ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఐల బదిలీలకు రంగం సిద్ధం?

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20 : పోలీసు శాఖలో సీఐల బదిలీకి రంగం సిద్ధమవుతోంది. జిల్లాలో దాదాపు 25మందిని బదిలీ చేయడానికి కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం.వైసీపీ ప్రజా ప్రతినిధులు,నేతలతో ఇన్నాళ్లూ అంటకాగినవారిని ఉన్నతాధికారులు లిస్ట్ అవుట్ చేస్తున్నారు.దాదాపు 10మంది సీఐలు గతంలో వైసీపీ నాయకుల మాటలు విని టీడీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు.ముఖ్యంగా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో కొంతమంది వైసీపికి వీర విధేయులుగా అన్ని పనులూ చక్కపెట్టారు. ఎన్నికల్లో ఓటర్లకు డబ్బుల పంపిణీ వ్యవహారాల్లో కూడా కొంతమంది సీఐలు యాక్టివ్‌గా పని చేశారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.మరోవైపు ఎన్నికల నేపథ్యంలో బయటినుంచి బదిలీపై వచ్చిన వారిని వెనక్కి పంపాక ఇక్కడ పనిచేసిన వారిలో అంకితభావం, క్రమశిక్షణ, పనిచేసే తత్వం వున్న వారికి మంచి పోస్టింగులు ఇవ్వాలనే భావనతో ఎస్పీ వున్నట్లు ప్రచారం జరుగుతోంది.వారం రోజుల్లో బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు వెలువడే అవకాశాలున్నాయని పోలీసు వర్గాలు చెబుతున్నాయి.



తిరుపతి విమానాశ్రయంలో గురువారం గనుల శాఖామంత్రి కొల్లు రవీంద్రను కలిసిన బైఎన్‌సేవ్ మధు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని తదితరులు

హెచ్‌టీ కాంప్లెక్స్ వద్ద ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగించిన అనంతరం హెచ్‌టీ కాంప్లెక్స్

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయానికి సమీపంలోని హెచ్‌టీ కాంప్లెక్స్ దుకాణాల వద్ద ఆక్రమణలను టీటీడీ అధికారులు గురువారం తొలగించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కొంతమంది కార్యకర్తలు ఇష్టానుసారం దుకాణాల ముందు స్థలాన్ని ఆక్రమించారు. భక్తులు వచ్చి వెళ్లేందుకు కూడా వీలులేకుండా హోటళ్ల నిర్వహకులు ఆక్రమణలకు పాల్పడ్డారు. కాంప్లెక్స్‌లోని వ్యాపారులు కూడా వీరి ఆక్రమణలతో వ్యాపారాలు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో టీటీడీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దుకాణాల ముందున్న ఆక్రమణలను తొలగించారు. కేటాయించిన స్థలంలోనే వ్యాపారాలు చేసుకోవాలని, నిబంధనలకు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎర్రచందనం స్వాధీనం : ఇద్దరు స్మగ్లర్ల అరెస్టు



పట్టుబడ్డ స్మగ్లర్లను చూపుతున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

మంగళం, జూన్ 20: అన్నమయ్య జిల్లా రాయవరం అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు పోలీసులు గురువారం ఇద్దరు స్మగ్లర్లను అరెస్టు చేశారు. కారుతో సహా 13 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఎస్ఐలు లింగాధర్, విశ్వనాథ్ బుధవారం రాయచోటి మీదుగా కూంబింగ్ నిర్వహించారు. సుండుపల్లి అటవీ బీట్ పరిధిలోని గంగోత్రి రాస్తా వద్ద అర్ధరాత్రి సమయంలో తనిఖీలు చేపట్టగా సుండుపల్లి సానిపాయ జంక్షన్ నుంచి ముగ్గురు మోటారు సైకిల్‌పై రావడాన్ని గుర్తించారు. టాస్క్‌ఫోర్సు పోలీసులను చూసి వారు పారిపోతుండగా సిబ్బంది వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. ఒకరు పారిపోయారు. కొందరు టాస్క్‌ఫోర్సు సిబ్బందిని చూసి కారును వదలి వెళ్లిపోయారు. కారులో 13 ఎర్రచందనం దుంగలున్నట్లు టాస్క్‌ఫోర్సు పోలీసులు నిర్ధారించారు. పట్టుబడ్డవారు తమిళనాడు వేలూరు జిల్లా కేవీకుప్పంకు చెందిన శరత్‌కుమార్ రవి(23), దేవరాజ్ గోవిందస్వామి(27)గా గుర్తించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నంలో కిందపడిన ఓ స్మగ్లర్‌కు తలకు గాయమైనట్లు వారు తెలిపారు. వీరితో పాటు 12మంది స్మగ్లర్లు పారిపోయినట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కూంబింగ్‌లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో గురుతర బాధ్యత

● రెవెన్యూ దినోత్సవంలో కలెక్టర్



రక్తదానం చేసినవారికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 20: ప్రజా సమస్యల పరిష్కారంలో రెవెన్యూ ఉద్యోగులు గురుతర బాధ్యత వహించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ హితవు పలికారు. కలెక్టరేట్‌లో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్, భూములు, తదితర సమస్యలపై బాధ్యతగా ఉండాలన్నారు. ప్రకృతి విపత్తు సమయాల్లో రెవెన్యూ శాఖ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని సమర్థంగా వ్యవహరించిందన్నారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ రెవెన్యూ సిబ్బంది మరింత చురుగ్గా పనిచేయాలన్నారు. డీఆర్వో పెంచల కిషోర్ మాట్లాడారు. అంతకు కలెక్టరేట్‌లో పలువురు అధికారులు, సిబ్బంది రక్తదానం చేశారు. రిటైరైన ఉద్యోగులను కలెక్టర్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఎస్‌డీసీ మురళి, ఉద్యోగ సంఘం నాయకులు గోపీనాథరెడ్డి, జీవన్ కలెక్టరేట్ అధికారులు గంగయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రెండు కిలోల గంజాయి స్వాధీనం

● నలుగురి అరెస్ట్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20: గంజాయి విక్రయిస్తున్న నలుగురిని ఈస్ట్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూ. 40 వేలు విలువ చేసే రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. సీఐ మహేశ్వర రెడ్డి కథనం మేరకు.. రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన దీపేష్, ఎద్దుల చెరువుకు చెందిన మేకల అశోక్, మదనపల్లె బర్మావీధికి చెందిన మణికంఠ, ఎస్‌టీవీ నగర్‌కు చెందిన భూపతి వాసులు కొంతకాలంగా తిరుపతిలో గంజాయి విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి నెలలో 10 రోజులు వివిధ ప్రాంతాలకు వెళి విక్రయించేవారు. ముందస్తు సమాచారం మేరకు సీఐ నేతృత్వంలో ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, పురుషోత్తమ రెడ్డి, సిబ్బంది ఎస్‌టీవీనగర్‌లో గురువారం వీరిని అదుపులోకి తీసుకున్నారు. రూ. 40వేల విలువైన రెండు కిలోల గంజాయిని సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేశారు.

23న జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సభ

తిరుపతి (ఆటోనగర్) జూన్20: నగరంలో ఈనెల 23న రాజకీయ పార్టీలకు అనుబంధంగా కార్మిక సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆదివారం తిరుచానూరు రోడ్డులోని గాయత్రి రెసిడెన్సీలో సర్వ సభ్యసమావేశం జరగనుంది. జనశక్తి ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ గౌరవాధ్యక్షుడు ఎ.సుధాకర్ ఈ విషయం తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాకు చెందిన సభ్యులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నవీన్‌కు పలువురి శుభాకాంక్షలు



కేక్ కట్ చేసిన కార్యక్రమంలో నవీన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి,అభిమానులు

తిరుపతి (జీవకోన), జూన్ 20: స్థానిక బీజేపీ నాయకులు నవీన్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు, అనుచరులు గురువారం నిర్వహించారు. పార్టీలకు అతీతంగా నాయకులు ఆయనను పుష్పగుచ్ఛాలు దుశ్శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన అనుచరులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా దాదాపు పేదలకు అన్నదానం చేశారు. టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి, పలు పార్టీల నాయకులు, వ్యాపారస్థులు, తదితరులు పాల్గొన్నారు.

హద్దులు దాటిన అంతస్తులు



మంగళం, జూన్ 20: సప్తగిరికాలనీ పంచాయతీ,రణదీనపురం పంచాయతీకి మధ్య ప్రధాన మార్గంలో అనుమతులను అతిక్రమించి ఓ వ్యక్తి భవనాన్ని నిర్మిస్తున్నారు. పంచాయతీ పరిధిలో జీ ప్లస్-టూ వరకే అనుమతులున్నా ఆరు అంతస్థులకు పైబడి నిర్మిస్తున్నారు. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా జరిగిన నిర్మాణాల్లో ఇది ఒకటిగా భావిస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి విజయభాస్కర్‌ను వివరణ కోరగా ఆరు నెలల క్రితమే పిలిచి పనులు ఆపివేయాలని చెప్పామన్నారు. రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

ఎన్‌టీఏ రద్దుకు విద్యార్థుల ఆందోళన

● నీట్ అవకతవకలపై విచారణ చేయించాలి



ఘంటసాల విగ్రహం వద్ద ప్లకార్డులతో ధర్నా చేస్తున్న విద్యార్థులు

తిరుపతి(విద్య), జూలై 20: నీట్ లాంటి అత్యున్నతమైన పరీక్షలు నిర్వహించే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ని రద్దు చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నీట్ లో అవకతవకలు జరిగాయంటూ విద్యార్థి సంఘం ఏఐడీఎస్ఓ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఘంటసాల విగ్రహం వద్ద విద్యార్థులు ధర్నా చేశారు. ఎన్‌టీఏ రద్దు చేయాలని, న్యాయ విచారణ జరిపించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. విద్యార్థి సంఘం వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ నీట్ ఫలితాల్లో ఒక కేంద్రంలో పరీక్ష రాసిన అనేక మంది విద్యార్థులకు ఒకటే స్కోరు రావడం ఎన్‌టీఏ అవకతవకలకు నిదర్శనమన్నారు. పేపర్ లీక్ అయిందన్నారు. ఎన్‌టీఏ నిర్వాకం వల్ల వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ వ్యవహారంపై న్యాయ విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాడుతామని ఏఐడీఎస్ఓ నాయకులు నవీన్, ఉన్నతి చెప్పారు. పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణం త్వరగా జరగాలని కోరుకున్నా

కురుగొండ్ల రామకృష్ణ



తెలంగాణా మున్సిపల్ చాంబర్స్ ఛైర్మన్ వెన్‌రెడ్డిరాజు- కురుగొండ్ల రామకృష్ణ

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా జరగాలని శ్రీవారిని కోరుకున్నట్టు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీకి కనీసం రాజధాని కూడా లేకుండాపోయిందన్నారు. టీడీపీ ప్రభుత్వం తిరిగి నిర్మాణం కావాలని, పరిశ్రమలు భారీగా రావాలని, అభివృద్ధి పనులు ఆగమేఘాలపై జరగాలని స్వామిని ప్రార్థించానన్నారు. ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

కానిస్టేబుల్‌పై ట్రావెల్స్ ఉద్యోగి దాడి

తిరుపతి(నేరవిభాగం), జూన్ 20: ప్రయివేటు ట్రావెల్స్ ఉద్యోగి తాగిన మత్తులో బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్‌పై దాడి చేశాడు. సీఐ మహేశ్వరరెడ్డి కథనం మేరకు ఈస్ట్ స్టేషన్‌లోని బ్లూకోల్ట్స్ కానిస్టేబుల్ విద్యాసాగర్ రెండు రోజుల క్రితం హైదరాబాదు పంపాలని శ్రీకృష్ణ ట్రావెల్స్‌లో పార్శిల్ ఇచ్చారు. అది చేరకపోవడంతో గురువారం ట్రావెల్స్ ఆఫీసుకు వచ్చి అక్కడున్న ఉద్యోగి సుబ్బరాజును అడిగాడు. మాటామాటా పెరిగింది. అప్పటికే తాగిన మైకంలో ఉన్న సుబ్బరాజు కానిస్టేబుల్ షర్టు చించి నేమ్ ప్లేటును ధ్వంసం చేశాడు. దాడిచేశాడు. కానిస్టేబుల్‌కు బలమైన గాయాలయ్యాయి. కేసు నమోదు చేసిన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి నిందితుడు సుబ్బరాజును అదుపులోకి తీసుకున్నారు. సుబ్బరాజుపై గతంలో పొద్దుటూరులో కేసులున్నట్లు సమాచారం.

వెంకటేశ్వరస్వామికి హనుమంత సేవ



గూడూరు అర్బన్, జూన్ 20: స్థానిక రాజా వీధిలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి తిరుచ్చి ఉత్సవం జరిపారు. రాత్రికి స్వామివారిని ప్రత్యేకం గా అలంకరించి హనుమంత వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

ఎలక్షన్ కమిషనర్‌ను కలసిన డాక్టర్ పద్మావతి



నాయుడుపేట, జూన్ 20 : ఏపీ స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నీలం సహానీ, పెట్రోలియం మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ సహానీ దంపతులు నాయుడుపేటలోని రైల్వే జాతీయ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు డాక్టర్ పద్మావతి, డాక్టర్ కళ్యాణ్‌సింగ్ దంపతులను గురువారం కలసి మాట్లాడారు. తిరుమలలో శ్రీవారి దర్శనం చేసుకొని విజయవాడకు వెళ్తూ మార్గ మధ్యలో డాక్టర్ పద్మావతి కుటుంబసభ్యులతో కలసి మాట్లాడారు. వారి వెంట ఉమ్మడి నెల్లూరుజిల్లా మాజీ డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మావతి అన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ



చిట్టమూరు, జూన్ 20 : మండల పరిధి యల్లసిరి పంచాయతీలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం మాజీ సర్పంచ్ పోలిన శ్రీనివాస్ చేతుల మీదుగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కొడేపాటి గంగా ప్రసాద్ (కేజీపీ) ఫౌండేషన్ దాతృత్వంతో 4 ప్రాథమిక పాఠశాలలోని 95 మంది పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్, ఇతర విద్యా సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో నాగూర్‌నాయుడు, మాజీ సర్పంచ్ నాగూరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



కోట, జూన్ 20 : మండల పరిధిలోని వంజివాకలో గురువారం తెల్లవారుజామున ఒక పూరిల్లు అగ్నికి ఆహుతైంది. స్థానికంగా ఉన్న గుండుబోయిన కృష్ణయ్య తన కుటుంబసభ్యులతో కలసి ఆరుబయట నిద్రిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌లో ఇంటి నుంచి మంటలు ఎగిశాయి. స్థానికులు వచ్చి మంటలను ఆర్పినా ఆరలేదు. కోట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలన ఆర్పగా అప్పటికే ఇల్లు పూర్తిగా కాలి దగ్ధమై కృష్ణయ్య కుటుంబం కట్టుబట్టలతో బయటపడింది. సమాచారం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, టీడీపీ నాయకులు చిల్లకూరు దశరథరామిరెడ్డి, కోనిశెట్టి రమేష్ ద్వారా రూ.20వేలు ఆ కుటుంబానికి ఇస్తున్నట్లు ప్రకటించారు.

కరుణించమ్మా....పోలేరమ్మ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- ముగిసిన జాతర





ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ, క్యూలో ఉన్న భక్తులు, మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

వెంకటగిరిటౌన్, జూన్ 20: బంగారుపేట పోలేరమ్మ జాతరలో గురువారం సందడి వాతావరణం నెలకొంది. స్థానికంగా నివాసం ఉంటూ ఉద్యోగ రీత్యా బయట ఉన్నవారు కూడా జాతరలో వచ్చి పాల్గొన్నారు. బంధుమిత్రులతో కలిసి ప్రతి ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. భక్తులు వెయ్యికళ్ల దుత్తలతో మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిదేళ్లకు నిర్వహించే జాతరలో అశేష జన పాల్గొనడంతో పోలీసులు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. జాతరలో సంచార అంగళ్లు ఆకట్టుకున్నాయి.



దుత్తలు తీసుకుని వెళ్తున్న భక్తులు

వీధుల్లో అంగళ్లు నెలకొనడంతో చిన్నారులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపించారు. జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ తొమ్మిదేళ్లకు జరిగే పోలేరమ్మ జాతరకు కమిటీ నిర్వాహకులు ఏర్పాట్లు బాగా చేశారన్నారు. పోలేరమ్మ దీవెనలు వెంకటగిరి ప్రజలపై ఉండాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు పులికల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, గంగాధర్, శ్రీనివాసులు, చెంగారావు, చంద్రమౌళి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం : ఎస్పీ



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

నాయుడుపేటటౌన్/తడ, జూన్ 20 : గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని జిల్లాఎస్పీ హర్షవర్ధన్‌రాజు వెల్లడించారు. గురువారం నాయుడుపేట, తడకు వచ్చిన ఆయన మొదటగా నాయుడుపేట డీఎస్పీ కార్యాలయానికి చేరుకొని రికార్డులు పరిశీలించి అనంతరం సర్కిల్ కార్యాలయం చేరుకొని రికార్డులను పరిశీలించారు. అక్కడ నుంచి భీములవారిపాళెం చెక్‌పోస్టులను పరిశీలించారు. నేర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గంజాయిపై కఠిన వైఖరిని అవలంబించాలంటూ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఆ ప్రకారం గంజాయి వినియోగించినా, రవాణాచేసినా కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని, ఆ బృందంలో ఒక సీఐతోపాటు ముగ్గురు ఎస్ఐలు, ఇతర సిబ్బంది ఉంటారని తెలిపారు. గంజాయిపై నిఘాపెట్టి రవాణాచేసే వ్యక్తులను గుర్తించి దానిని అరికట్టడమే ఈ బృందం లక్ష్యమని తెలిపారు. ఈ సందర్భంగా భీములవారిపాళెం చెక్‌పోస్టులోని సెబ్ విభాగంలో పలు రికార్డులను పరిశీలించారు. అక్రమ రవాణాను అరికట్టేలా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని అక్కడ అధికారులను ఆదేశించారు. ఎస్పీతోపాటు డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐలు శ్రీనివాసులురెడ్డి, మధుబాబు, జగన్‌మోహన్‌రావు, ఎస్ఐలు గోపీ, నరసింహరావు ఉన్నారు.

విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి

సూళ్లూరుపేట : పబ్లిక్ న్యూసెన్స్ తగ్గించాలనే ముఖ్య ఉద్దేశంతో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ విష్ణువర్ధన్ రాజు అన్నారు. గురువారం ఆయన సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో స్నేహభావంతో మెలిగి బాధితులకు న్యాయం చేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపతామన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసుల రెడ్డి, సీఐ మధుబాబు, శ్రీహరికోట ఎస్ఐ రఘునాథ్ ఉన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

వెంకటగిరి, జూన్ 20 : వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూపేట విద్యుత్ సబ్‌డివిజన్లకు సంబంధించి విద్యుత్ లోక్ అదాలత్ సూళ్ళూరుపేటలోని షార్ మినీ బైపాస్ రోడ్డులో వున్న పంక్షన్ హాల్లో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని నాయుడుపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ప్రసన్నకుమార్ తెలిపారు. గురువారం ఆయన వెంకటగిరిలో మీడియాతో మాట్లాడుతూ వినియోగదారులు తమ సమస్యలు లోక్ అదాలత్ దృష్టికి తీసుకు వచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

రేపు ఓజిలి మండల సమావేశం

ఓజిలి,జూన్20 : ఓజిలి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశంలో విద్య, వైద్య ఆరోగ్య, వ్యవసాయం, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ నీటిపారుదల వంటి శాఖలపై సమీక్ష చేయనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి అధికారులు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

చిల్లకూరు, జూన్ 20: చిల్లకూరు సచివాలయంలో గురువారం 50 శాతం రాయితీతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పెంచలకోన ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ తానంకి నానాజీ మాట్లాడుతూ రైతులు భూసారాన్ని పెంచుకుని అధిక దిగుబడులు సాధించేందుకు ప్రభుత్వం రాయితీలో పచ్చిరొట్ట విత్తనాలను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, మల్లికార్జున్, నవీన్‌చంద్ర, శివకుమార్, వ్యవసాశాఖ ఏడీ గోపీనాయక్, ఏవో భవానీ, సిబ్బంది శివశంకర్, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల స్వచ్ఛభారత్



కోట, జూన్ 20: కోట పోలీసులు గురువారం వినూత్న రీతిలో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. వాకాడు సీఐ హరికృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగబాబు పలువురు పోలీసులతో కలసి బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న మందుబాబులపై దాడులు నిర్వహించి వారిచేతనే చీపుర్లుపట్టి శుభ్రం చేయిస్తున్నారు.

హుస్సేనమ్మ దర్గా ఉత్సవాలు ప్రారంభం




దీపాలంకరణలో దర్గా, దర్గాలో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

దొరవారిసత్రం, జూన్ 20 : దొరవారిసత్రం మండలం నెలబల్లిలోని హుస్సేనమ్మ దర్గా 54వ గంథోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మూడురోజులపాటు జరిగే గంథోత్సవాల్లో మొదటిరోజు దర్గా ప్రత్యేక దీపాలంకరణ, పుష్పాలంకరణ చేశారు. దర్గా ప్రాంగణం చిరు అంగళ్ళతో సందడిగా మారింది. భక్తులు కొంతమేర విచ్చేశారు. భక్తులు మొదటి రోజు దర్గా చుట్టూ ప్రదక్షణలు చేశారు. అలాగే కొంత మంది భక్తులు దర్గా ప్రాంగణంలో నిద్రించారు. భక్తులు కోసం దర్గా కమిటీ ప్రత్యేక కోలాట ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. తెల్లవారు జామున దర్గా గంధం నెలబల్లి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు జరగనుంది.



మంత్రి రవీంద్రను కలిసిన టీడీపీ నాయకులు

రేణిగుంట, జూన్ 20 : రాష్ట్ర గనుల శాఖమంత్రి కొల్లు రవీంద్రను టీడీపీ నాయకులు గురువారం విమానాశ్రయంలో కలిశారు.తిరుమల నుంచి తిరిగి వెళుతున్న మంత్రిని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీసీ నాయకులు పుష్పావతి, కృష్ణయాదవ్, ఆనంద్‌యాదవ్ మంత్రి చేత కేక్ కట్ చేయించారు.

తమిళ రేషన్ బియ్యం స్వాధీనం

సూళ్లూరుపేట, జూన్ 20: సూళ్లూరుపేట పట్టణం వట్ర పాలెంలో అక్రమంగా నిల్వచేసిన తమిళ రేషన్ బియ్యం బస్తాలను గురువారం విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకొన్నారు. వట్రపాలెంలోని చలువాది రవి ఇంటి ఆవరణలో ప్లాస్టిక్ గోనె సంచుల్లో అక్రమంగా ఉన్న 279 బస్తాల బియ్యం నిల్వలు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణ నాయక్, సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య బృందం పట్టుకొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం

గూడూరు అర్బన్, జూన్ 20: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై చర్యలు తీసుకుం టామని పట్టణ సీఐ పాపారావు అన్నారు.

హైవే కూడళ్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలి

గూడూరు, జూన్20: జాతీయ రహదారిపై పలు కూడళ్ల వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు విజయవాడ లో నేషనల్ హైవే ఆథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ అధికారి కేఆర్ సింగ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ నీరజ్‌గుప్తాకు గురువారం విన్నవించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ- చెన్నై జాతీయ రహదారిలో గూడూరు పోటుపాళెం, చిల్లకూరు వరగలి క్రాస్‌రోడ్డు కూడళ్ల సమీపంలో పలు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, కల్యాణ మండపాలు ఉన్నాయన్నారు. దీంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆయా కూడళ్ల వద్ద ట్రాఫిక్ ఇబ్బం దులతోపాటు రోడ్డు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయన్నారు. హైవేపై వెళ్లే వాహనాలకు సంబంధం లేకుండా ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లు నిర్మించాలని వారిని కోరామన్నారు.



నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



గూడూరు, జూన్ 20: నింబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం డీప్యూటీఈవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు డివిజన్ పరిధిలో పలు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అధిక ఫీజులు వసూళ్లు చేస్తూ, అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న, అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో బీజేవైఎం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో శివశంకర్, కమల్, ప్రదీప్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీఈవో కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

త్వరగా రాజధాని నిర్మాణం జరగాలని కోరుకున్నా

ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

తిరుమల, జూన్20(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణం త్వరగా జరగాలని శ్రీవారిని కోరుకున్నట్లు వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీకి కనీసం రాజధాని కూడా లేకుండా పోయిందన్నారు. తిరిగి రాజధాని నిర్మాణం కావాలని, పరిశ్రమలు భారీగా రావాలని, అభివృద్ధి పనులు ఆగమేఘాలపై జరగాలని స్వామిని ప్రార్థించానన్నారు. అన్ని రకాలుగా సీఎం చంద్రబాబు నాయుడికి ధైర్యం ఇవ్వాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	150
లేయర్ లైవ్	120
స్కిన్ చికెన్	264
స్కిన్‌లెస్	294
లేయర్	204

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6850
వెండి కిలో ధర	రూ. 92,600
వెండి ఒక గ్రాము	రూ. 94.60

నిబద్ధతకు మారు పేరు రెవెన్యూ శాఖ



విశ్రాంత వీఆర్వో రాజగోపాల్‌ను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

పెళ్లకూరు, జూన్20: రెవెన్యూశాఖ నిబద్ధతకు మారు పేరు అని.. ప్రభుత్వ విభాగాలకు తల్లిలాంటిదని తహసీల్దార్ కేవీఆర్వీ ప్రసాద్ రావు పేర్కొన్నారు. గురువారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన రెవెన్యూ దినోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ సిబ్బంది చొరవ చూపాలన్నారు. అనంతరం విశ్రాంత వీఆర్వోలు చాగణం రాజగోపాల్, బాలచంద్రశేఖర్ రెడ్డితో పాటు సీనియర్ రైతు నల్లాడి హరినాథ్ రెడ్డిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోషిబాయి, వీఆర్వోలు రవిచంద్ర, సుధాకర్, తేజ, మోబీనా, వంశీ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పేరం రమేష్‌నాయుడు, దామెర ప్రసాద్‌నాయుడు, వెంకటసుబ్బయ్య, సత్యంరాజు, వేణురెడ్డి, చంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రమణయ్య తదితరులు ఉన్నారు.

విపత్తుల్లో రెవెన్యూ అధికారుల సేవలు కీలకం : ఆర్డీవో



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట టౌన్, జూన్ 20 : విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలను రక్షించే సందర్భాలలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది కీలకంగా విధులు నిర్వహిస్తారని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రభుత్వం ప్రకటించడంతో గురువారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆర్డీవో పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తహసీల్దారు కళ్యాణి, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర, ఆర్ఐలు, వీఆర్వోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తడ : స్థానిక తహసీల్దారు కార్యాల యంలో రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. గురువారం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ప్రతిభ కనపరచిన రెవెన్యూ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపీడీవో మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు శరత్ బాబు, ఆర్ఐ శ్రావణ్ పాల్గొన్నారు.

మాజీ రెవెన్యూ సిబ్బందికి సన్మానం



చిట్టమూరు, జూన్ 20: చిట్ట మూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహ సీల్దార్ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్స వం జరుపుకొ న్నారు. అన్ని గ్రామాల నుంచి రైతులను ఆహ్వానించి రెవెన్యూ రికార్డుల కూర్పు, రికార్డులో వారి భూముల వివరాలు చూపించారు. ఈ సందర్భంగా మాజీ రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ శ్రీనివాస శర్మ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్, ఆర్ఐ మధులత, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి-మధురై బస్సులో ఛార్జీల తగ్గింపు

తిరుపతి(ఆర్టీసీ),జూన్20: శ్రీకాళహస్తి- మధురై ఆర్టీసీ బస్సులో ఛార్జీలను తగ్గించారు. ఇంటర్‌స్టేట్ రవాణాను పరిగణలోకి తీసుకుని తమిళనాడు తరహాలోనే అధికారులు ఛార్జీలను ఖరారు చేశారు. 25శాతం టికెట్ రేటు తగ్గించి బుధవారం నుంచి అమలు చేస్తున్నారు. తాజాగా పెద్దలకు రూ.765, పిల్లలకు రూ.430 వసూలు చేస్తున్నారు. ఈ బస్సు రోజూ సాయంత్రం 5గంటలకు శ్రీకాళహస్తి నుంచి బస్ బయల్దేరుతుంది. తిరుపతిచేరుకుని 6.30 గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 6.15గంటలకు చేరుకుంటుంది. అక్కడ నుంచి సాయంత్రం 6గంటలకు బయల్దేరి మర్నాడు ఉదయం 6గంటలకు తిరుపతి, 7గంటలకు శ్రీకాళహసి చేరుకుంటుంది. తిరుపతి-కాణిపాకం మధ్య అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన రెండు అల్ట్రాడీలెక్స్ బస్సులు ఏర్పాటు చేశారు. తిరుపతి సీబీఎస్‌లో ఉదయం 6.20 గంటలకు, 7.20 గంటలకు ఈ బస్సులు బయల్దేరుతాయి.

శ్రీకాళహస్తి
సత్యవేడు

అక్రమంగా నిర్మించిన గదుల కూల్చివేత



సీబీఐడీ కాలనీ వద్ద అక్రమంగా నిర్మించిన గదులను కూల్చివేస్తున్న దృశ్యం

రేణిగుంట, జూన్ 16: రేణిగుంట పట్టణ పరిధిలో ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మించిన 84 గదులను గురువారం తెల్లవారుజామున పోలీసు బలగాల సాయంతో ప్రభుత్వ అధికారులు కూల్చివేశారు. రేణిగుంట పంచాయతీ పరిధిలోని సీబీఐడీ కాలనీ వద్ద నిర్మించిన గదులకు అనుమతులు లేవని, వాటిని తొలగించాలని తహసీల్దారు నాగేశ్వరావు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎక్సకవేటర్లతో ఆ ప్రాంతానికి వెళ్లగా స్థానికులు అడ్డుకున్నారు. దీంతో గురువారం తెల్లవారుజామున పోలీసులు వైసీపీ నాయకులను హౌస్ అరెస్టు చేశారు. తహసీల్దారు నాగేశ్వరరావు నేతృత్వంలో సీబీఐడీ కాలనీ వద్ద నిర్మించిన 24 గదులను ఎక్సకవేటర్లతో సాయంతో కూల్చివేశారు. అలాగే వివేకానంద కాలనీ కాల్వ వంకలో అక్రమంగా నిర్మించిన 60గదులను కూల్చివేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుచిరంజీవి, ఈవోపీఆర్డీ రత్నప్రభ, పంచాయతీ కార్యదర్శి రవిశంకర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. కాగా, ఈ అక్రమ నిర్మాణాలకు పంచాయతీ అధికారులే ఎన్‌వోసీలు ఇవ్వడం గమనార్హం.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, జూన్ 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురు దక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ట ఏర్పాటు చేశారు. అనంతరం వినాయక పూజల కలశ పూజ వైదిక కత్రువులు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో వైభవంగా అభిషేకం నిర్వహించారు. సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత హారతి, చక్ర హారతి, కుంభ హారతి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విద్యతోనే ఉన్నతి

శ్రీకాళహస్తి, జూన్ 20: విద్యతో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని రాచగున్నేరి మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు, జేకే స్టీల్స్ అధినేత బొల్లినేని జగన్నాధం నాయుడు అన్నారు. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరిలో ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలు, యూనిఫాంను ఆయన ముఖ్యఅతిధిగా విచ్చేసి విద్యార్థులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రగతి ట్రస్టు చంద్రశేఖర్, నాయకులు నర్రా చంద్రమౌళి, మునిబాబు, మురళి, ప్రధానోపాధ్యాయురాలు గిరిజ, ఉపాధ్యాయులు లింకన్, శాంతకుమారి, సుజాత, రాజశేఖర్, రామతులసి, రమణ్య, రఘు, రామమూర్తి, హేమలత, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

నాగలాపురం, జూన్ 20: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పతాంజలి యోగా గురువు రమేష్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నాగలాపురం పట్టణంలో యోగా దినోత్సవ కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రతిరోజు ఉదయం 5నుంచి 7గంటల వరకు ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఎవరైనా తమ గ్రామాల్లో యోగా సాధనకు శిక్షణా శిబిరం ఏర్పాటు చేసుకోవాలన్నా తాము సహకరిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు సంగీత, జయరాం తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభం

ఏర్పేడు, జూన్ 20: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో కేంద్రీయ విద్యాలయాన్ని ఐఐటీ అధికారులు ప్రారంభించారు. కేంద్రీయ విద్యాలయంలో 1నుంచి 5వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు.

ఫైబర్ కేబుళ్ల గుంతలు పూడ్చండి

కేవీబీపురం, జూన్ 20: మండలంలో ఇటీవల ఫైబర్ నెట్ కేబుళ్ల ఏర్పాటు నిమిత్తం కోసం శ్రీకాళహస్తి - పిచ్చాటూరు ప్రధాన రహదారి పక్కన, కళత్తూరు వెళ్లే రోడ్డులో, పూడి గ్రామానికి వెళ్లే రోడ్డులో గుంతలు తవ్వారు. పనులు పూర్తయ్యాక గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేశారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గుంతలను వెంటనే పూడ్చించాలని మండలవాసులు కోరుతున్నారు.

శ్రీకాళహస్తీశ్వరాలయంలో
26న సామూహిక అక్షరాభ్యాసం

శ్రీకాళహస్తి, జూన్ 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఈనెల 26న ఉదయం 9.30 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఈవో నాగేశ్వరరావు తెలిపారు.

పల్లికొండేశ్వరుడి
హుండీ ఆదాయం రూ.4.30 లక్షలు

నాగలాపురం, జూన్ 20: సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో గురువారం హుండీ లెక్కింపు జరిగింది. గత 42 రోజులకు సంబంధించి రూ.4,30,714 ఆదాయం వచ్చినట్లు జూనియర్ అసిస్టెంట్ శరవణన్ తెలిపారు. అలాగే అన్నదాన హుండీల ద్వారా రూ.33,754 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారి రామచంద్రారెడ్డి, గ్రూప్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ పనిరాజు శయన, సిబ్బంది పాల్గొన్నారు.

విషగుళికలు తిని
దివ్యాంగురాలి ఆత్మహత్య

ఏర్పేడు, జూన్ 20: విష గుళికలు తిని దివ్యాంగురాలు మృతి చెందిన ఘటన ఏర్పేడు మండలంలో గురువారం చోటు చేసుకుంది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు... పెనగడం పంచాయతీ గిరిజనకాలనీకి చెందిన మురళి కుమార్తె సుధ(13) పుట్టినప్పటి నుంచి నడవలేని స్థితిలో ఉంది. గురువారం ఆమె తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో ఉన్న సుధ విషగుళికలు తిని ఆత్మహత్యకు పాల్పడింది. పక్కింటి వారు గుర్తించి తల్లిదండ్రులకు తెలియజేశారు. వారు వచ్చి కుమార్తెను చికిత్స నిమిత్తం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు: ఎస్పీ



వాటర్‌హౌస్ కాలనీ వద్ద మద్యం సీసాలను తొలగింపజేస్తున్న ఎస్పీ

శ్రీకాళహస్తి, జూన్ 20: బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. శ్రీకాళహస్తిలో బహిరంగంగా మద్యపానం చేసే ప్రదేశాలను స్థానిక పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ పరిశీలించారు. పట్టణంలోని వాటర్‌హౌస్ కాలనీ పక్కనే ఉన్న స్వర్ణముఖి నది ప్రదేశాన్ని పరిశీలించారు. పురపాలక సంఘ సిబ్బంది ఆయా చోట్ల పరిసరాలను శుభ్రం చేశారు. శ్రీకాళహస్తిలో ఈ తరహా ప్రదేశాలపై ఎస్పీ ఆరా తీశారు. పట్టణం పరిధిలో మొత్తం 17ప్రదేశాలను గుర్తించినట్లు డీఎస్పీ ఉమామహేశ్వర రెడ్డి వివరించారు. అన్నిచోట్ల పోలీసు సిబ్బంది తరచూ తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాలని ఎస్పీ సూచించారు. ఇక బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం కూడా నిషేధించి అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డీఎస్పీ వెంకటాద్రి, శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ సీఐలు, ఎస్‌ఐలు, కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల విషయంలో రాజీ పడకండి

బుచ్చినాయుడుకండ్రిగ: శాంతి భద్రతల విషయంలో రాజీ పడవద్దని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ పోలీస్‌స్టేషన్ గురువారం ఆయన పరిశీలించారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులు గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఇసుక అక్రమ రవాణా, ట్రాఫిక్‌పైన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ వెంకట్రాది, ఎస్‌ఐ వెంకటనరసింహ, ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి



చిన్నారులతో ఎంఈవో భువనేశ్వరి

శ్రీకాళహస్తి, జూన్ 20: బడి ఈడు పిల్లలందరూ పాఠశాలకు వెళ్లాలని శ్రీకాళహస్తి ఎంఈవోలు భువనేశ్వరి, బాలయ్య అన్నారు. పట్టణ పరిధిలోని భరద్వాజ గిరిజనకాలనీలో గురువారం నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న వసతులను వివరించారు. పాఠశాలకు వెళ్లేందుందుకు ఇబ్బంది ఉంటే హాస్టల్ వసతి కలిగిన పాటశాలల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామని తల్లిదండ్రులకు వివరించారు. ఐదవ తరగతి పూర్తిచేసిన పిల్లలందరూ విధిగా ఆరవ తరగతిలో చేరేలా తల్లిదండ్రులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, సీఆర్పీలు మునిమోహన్, శాంతి, లలిత, ప్రసాద్, గాంధీ, స్వప్న, హేమలత పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: బడి ఈడు పిల్లలందరినీ తప్పకుండా పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో రవీంద్రనాథ్ అన్నారు. బుచ్చినాయుడుకండ్రిగ పంచాయతీ తంగెళ్లపురం గిరిజన కాలనీలో గురువారం ఆయన పర్యటించారు. బడి మానివేసిన విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బడి మానివేసిన విద్యార్థులకు పాఠశాలలో అడ్మిషన్ కల్పించారు.

సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 20: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటుకు గ్రామానికి చెందిన దాత సుందరరెడ్డి దంపతులు గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కోలా ఆనంద్‌ను సన్మానిస్తున్న టీడీపీ నాయకుడు సత్రవాడ ప్రవీణ్, బీజేపీ నేత మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి - అన్నదానం

ఘనంగా కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 20: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్ కోలా ఆనంద్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మొదటగా కోలా ఆనంద్ శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. ఎన్డీఏ కూటమి నాయకులు కోలా ఆనంద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకుడు సత్రవాడ ప్రవీణ్ కోలా ఆనంద్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రమేష్‌బాబు, మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి మునెయ్య, గురవయ్య, బత్తిన గోపాల్, అయ్యప్ప, వరుణ్, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

సత్యవేడు, జూన్ 20: సత్యవేడు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ రామాంజనేయులు ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం జరుపుకున్నారు. రెవెన్యూ శాఖలో విశేష సేవలు అందించిన విశ్రాంత ఆర్‌ఐ గోకుల్, వీఆర్వో సుబ్రహ్మణ్యంను పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో డీటీ రవీంద్రబాబు, జూనియర్ అసిస్టెంట్ కళావతి, తేజ, వీఆర్వోలు ఇళయరాజ, భార్గవ్, విక్రాంత్, రాఘవేంద్ర, రమేష్, మోహన్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ ఆలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు.

వరదయ్యపాళెం: మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం వద్ద తహసీల్దారు ఉదయభారతి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ దినోత్సవం జరుపుకున్నారు. రెవెన్యూ శాఖ రైతులు, ప్రజలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి పొదుపుపై అవగాహన

పిచ్చాటూరు, జూన్ 20: స్థానిక జడ్పీ హైస్కూలులో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకుంటేనే భవిష్యత్‌లో ఇబ్బందులు ఉండవన్నారు. ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంత నిర్మించుకోవాలని సూచించారు. అలాగే మురికి కాలువలు శుభ్రం చేసుకుంటూ ఆరోగ్యాన్ని పరీక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవోలు హేమమాలిని, యుగంధర్‌రాజు, ప్రధానోపాధ్యాయుడు గిరిప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.300 అందేలా చూడండి

ఏర్పేడు, జూన్ 20: ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.300 రోజువారీ వేతనం అందేటట్లు చూడాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఏర్పేడు మండలం అముదూరు పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలతల మేరకు రూ.300 రోజువారీ వేతనం పొందుతూ వారానికి రూ.1,800, వంద రోజులకు రూ.30వేలు వేతనం పొందే విధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో దేవరి, ఫీల్డ్ అసిస్టెంట్ రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

కమనీయంగా కమలనాథుడి కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో ఉభయ దేవేరులతో ప్రసన్న వెంకటేశ్వరుడు

వడమాలపేట, జూన్ 20: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అప్పలాయగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమలనాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం పద్మావతీ, అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వరుడిని పట్టు పీతాంబరాలతో నూతన వధూవరులుగా అలంకరించి కల్యాణం పీఠాన్ని అధిరోహింపజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారుచార్యులు, తిప్పయాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శాస్త్రోక్తంగా ప్రసన్న వెంకటేశ్వరుడిచే ఉభయ నాంచారులకు మాంగల్య ధారణ చేయించారు. నూతన వధూవరులచే తలంబ్రాలు పోయించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.

తాగునీటి పైపుల ధ్వంసం

ఆగిన సరఫరా ● ఇబ్బంది పడుతున్న జనం ● పట్టించుకోని అధికారులు



కావలివీధిలో తవ్విన కాలువలో పైప్‌లైన్ లీకేజీ

వడమాలపేట, జూన్ 20: మండల కేంద్రమైన వడమాలపేటలో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. స్థానిక కావలి వీధిలో మురుగు నీటి కాలువల నిర్మాణం కోసం తుడా నిధులతో గుంతలు తవ్వారు. ఈ క్రమంలో పలు వీధుల్లో తాగునీటా పైపులు ధ్వంసం అయ్యాయి. దీంతో ఐదు రోజులుగా తాగునీటి సరఫరా ఆగిపోయింది. తుడాతో పాటు అర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోకపోవడంతో సమస్య తీవ్రతరమైంది. ప్రజల ఇబ్బందులు పడుతుండడంతో పంచాయతీ కార్యదర్శి రూ.30 వేలకు పైగా వ్యయం చేసి కావలివీధి, చాకలివీధి, బజారువీధి, దళితవాడలో ట్యాంకర్లతో తాగునీరు అందిస్తున్నారు. వెంటనే తుడా అధికారులు స్పందించి ధ్వంసమైన పైపులను బాగు చేయకుంటే మురుగు నీటి కాలువల నిర్మాణ పనులను అడ్డుకుంటామని టీడీపీ నాయకులు హెచ్చరిస్తున్నారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయహస్తాధీశుడి కటాక్షం



కల్పవృక్ష వాహనంపై శ్రీనివాసుడు, సర్వభూపాల వాహనంపై శ్రీహరి

వడమాలపేట, జూన్ 20: అప్పలాయగుంట బ్రహ్మోత్సవాల్లో గురువారం కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయహస్తాధీశుడు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. ఉదయం స్వామివారు ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో సర్వాలంకార భూషితుడుగా పద్మావతీ, అండాల్ సమేతంగా రాజమన్నార్ అలంకారంలో మాడ వీధుల్లో ఊరేగారు. అనంతరం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం భక్తుల గోవిందనామ స్మరణలతో శ్రీవారికి ఊంజల సేవ జరిపారు. రాత్రి సర్వభూపాలులను వాహనంగా చేసుకున్న వెంకటేశ్వరుడు ప్రసన్న వదనంతో మేళ తాళాలు, మంగళవాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలతో మాడవీధుల్లో తిరుగాడుతూ భక్తులకు కటాక్షించారు.

నేడు శ్రీవారి గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి 7.00-8.30 గంటల మధ్య గరుడోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాల రాకపోకల నియంత్రణ కోసం తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

విద్యా సామగ్రి అందజేత



విద్యార్థులకు సామగ్రి అందిస్తున్న పోతుగుంట విజయబాబు

పుత్తూరు అర్బన్, జూన్ 20: మున్సిపల్ పరిధిలోని చిన్నరాజుకుప్పం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు సామగ్రి అందజేశారు. అలాగే పాఠశాలకు బీరువా వితరణగా అందించారు. కార్యక్రమంలో ఈ.రవినాయుడు, బాలాజీ నాయుడు, ధనపాల్, విజయ్‌చౌదరి, రమేష్‌నాయుడు, అజయ్ చౌదరి, చంద్రాయాదవ్, మేఘనాథ్, మణి, గ్రామస్థులు ఎన్.ఆదికేశవ నాయుడు, గోవర్ధన్ నాయుడు, రూపేష్, చినపాప, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

వడమాలపేట, జూన్ 20: యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని బ్రహ్మకుమారి జయంతి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా విద్యార్జనపై దృష్టి సారించడానికి యోగా ఉపయోగపడుతుందని చెప్పారు.

నోటు పుస్తకాల పంపిణీ

వడమాలపేట, జూన్ 20: నగరి ఎమ్మెల్యేగ గాలి భానుప్రకాష్ జన్మదినం సందర్భంగా గురువారం మండలంలోని పాదిరేడు, ఓబీఆర్ కండ్రిగ గ్రామాల్లో 80మంది విద్యార్థులకు టీడీపీ నాయకులు నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గణపలి రాయల్, దాముయాదవ్, వెంకటేశ్వర రావ్, శ్రావణ్, గుణశేఖర్, గురవయ్య, సుధాకర్‌రాజు, మురళి, రాజేంద్ర, మధు, మహేష్, చక్రవర్తి, మనోహర్, రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజన ప్యాకెట్లు అందజేస్తున్న గాలి జీవరత్నంనాయుడు

పుత్తూరు అర్బన్, జూన్ 20: మున్సిపల్ పరిధిలోని కల్యాణపురం వద్ద ఉన్న వృద్ధాశ్రమంలోని మహిళలకు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ జన్మదినం సందర్భంగా గురువారం టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.భాస్కర్, లక్ష్మణాచారి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

తమిళ రేషన్ బియ్యం స్వాధీనం



సూళ్లూరుపేట, జూన్ 20: సూళ్లూరుపేట పట్టణం వత్రపాలెంలో అక్రమంగా నిల్వచేసిన తమిళ రేషన్ బియ్యం బస్తాలను గురువారం విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకొన్నారు. వత్రపాలెంలోని చలువాది రవి ఇంటి ఆవరణలో ప్లాస్టిక్ గోనె సంచుల్లో అక్రమంగా ఉన్న 279 బస్తాల(13,700 కిలోలు) బియ్యం నిల్వలు విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణ నాయక్, సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య బృందం పట్టుకొన్నారు. పట్టుబడిన బియ్యం బస్తాలను సివిల్ సప్లయ్ గోదాముకు తరలించారు. చలువాది రవిపై కేసు నమోదు చేశారు.

రెవెన్యూ ఔన్నత్యాన్ని కాపాడండి

డక్కిలి : గతంలో పనిచేసిన అధికారుల పనితీరు వల్లే రెవెన్యూ శాఖ అంటే ప్రజల్లో గౌరవం ఉందని, ఆ గౌరవం మసక బారకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. డక్కిలి రెవెన్యూ కార్యాలయ ఆవరణలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూలో పనిచేసే ప్రతి ఒక్కరూ ప్రజలకు జవాబుదారీ తనంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు బాలకృష్ణయ్య, ప్రచారకార్యదర్శి గుండాలు వేవర, ఎంతవోలు వెంకటేశ్వర్లు, పిన్నక జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధం

గూడూరు అర్బన్, జూన్ 20: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నిషేధమని, ఎవరైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ పాపారావు అన్నారు. గురువారం పట్టణంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల, రైల్వేపార్శిల్ కార్యాలయం, రైల్వేస్టేషన్, బొగ్గులదిబ్బ, పీఎస్ఆర్ పార్కు, సాధుపేట తదితర ప్రాంతాలలో పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి తగాదాలకు దిగినా, ప్రజలకు ఇబ్బందులు కలిగించినా చట్టపరమైన చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విపత్తుల్లో రెవెన్యూ అధికారుల సేవలు కీలకం

ఆర్డీవో చంద్రముని



మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట టౌన్, జూన్ 20 : విపత్తులు తలెత్తినప్పుడు ప్రజలను రక్షించే సందర్భాలలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది కీలకంగా విధులు నిర్వహిస్తారని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని అన్నారు. జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా ప్రభుత్వం ప్రకటించడంతో గురువారం నాయుడుపేట తహసీల్దారు కార్యాలయంలో ఆర్డీవో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూశాఖ ద్వారా ప్రజలకు అందుతున్న సేవలపై ఆర్డీవో పలు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట తహసీల్దారు కళ్యాణి, డిప్యూటీ తహసీల్దారు రాజేంద్ర, ఆర్ఐలు, వీఆర్వోలు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తడ : స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రెవెన్యూ డేను ఘనంగా నిర్వహించారు. గురువారం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగులను సన్మానించారు. ప్రతిభ కనపరచిన రెవెన్యూ ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దారు శరత్ బాబు, ఆర్ఐ శ్రావణ్ పాల్గొన్నారు.

మాజీ రెవెన్యూ సిబ్బందికి సన్మానం



చిట్టమూరు, జూన్ 20: చిట్టమూరు రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో రెవెన్యూ దినోత్సవం జరుపుకొన్నారు. అన్ని గ్రామాల నుంచి రైతులను ఆహ్వానించి రెవెన్యూ రికార్డుల కూర్పు, రికార్డులో వారి భూముల వివరాలు చూపించారు. ఈ సందర్భంగా మాజీ రెవెన్యూ సిబ్బందిని తహసీల్దార్ శ్రీనివాస శర్మ సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీటీ విజయలక్ష్మి, రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్, ఆర్ఐ మధులత, మండల సర్వేయర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



